తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం - 26 - మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 365 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# ‘ఆపరేషన్ సింధూర్’ గర్వకారణం: ప్రధాని మోదీ

- ఉగ్రవాదంపై భారత్ ఐక్యంగా పోరాటం
- సరిహద్దుల్లో ఉగ్ర స్థావరాలపై ధ్వంసాత్మక దాడులు
- జయఘోషాలతో త్రివర్ణ పతాక ర్యాలీలు
- ‘సింధూర్’గా పేర్లు – ప్రజల మనస్సుల్లో దేశభక్తి ప్రతిబింబం
- పహల్గామ్ దాడిపై తీవ్ర ప్రతిస్పందన వచ్చేలా హెచ్చరిక
- దేశం మొత్తం సంఘీభావం తెలిపింది

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు): పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ‘ఆపరేషన్ సింధూర్’లో భారత సైనికులు చూపిన శౌర్యపరాక్రమాలు యావత్ దేశానికి గర్వకారణంగా నిలిచాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం ‘మన్ కీ బాత్(122వ ఎపిసోడ్(మే 25)లో ప్రధాని నరేంద్ర మోదీ తన మసుసులోని మాటను వ్యక్తం చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం ఐక్యంగా నిలిచిందని, ‘ఆపరేషన్ సిందూర్’ సమయంలో మన దళాలు ప్రదర్శించిన ధైర్యం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి ‘ఆపరేషన్ సిందూర్’ కొత్త విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్దేశ ప్రజలను ఎంతగానో ప్రభావితం చేసిందని, పలు కుటుంబాలు దీనిని తమ జీవితంలో భాగంగా చేసుకున్నారని అన్నారు. ప్రతి భారతీయుని సంకల్పం ఉగ్రవాదాన్ని నిర్మూలించడమేనని అన్నారు. సరిహద్దు వెంబడి ఉన్న ఉగ్రవాద స్థావరాలను మన దళాలు ధ్వంసం చేశాయన్నారు.

మిగతా 2లో..

## భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరణ





(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు): ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ వేగంగా ఎదుగుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విడుదల చేసిన తాజా 'ప్రపంచ ఆర్థిక నివేదిక ఏప్రిల్ 2025' ప్రకారం, భారత్ ఈ ఏడాది (2025) జపాన్‌ను వెనక్కినెట్టి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది. ఈ కీలక పరిణామం భారత ఆర్థిక ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలవనుంది. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం, 2025 ఆర్థిక సంవత్సరానికి (FY26) భారత నామమాత్ర జీడీపీ 4,187.017 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 348 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా. ఇదే కాలంలో జపాన్ జీడీపీ 4,186.431 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ. 347.9 లక్షల కోట్లు) ఉండొచ్చని పేర్కొంది. ఈ స్వల్ప తేడాతో భారత్, జపాన్‌ను అధిగమించి నాలుగో స్థానానికి ఎగబాకనుంది. ప్రస్తుతం (2024 వరకు) భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. భారత్ ప్రస్థానం ఇక్కడితో ఆగదని, రానున్న సంవత్సరాల్లో జర్మనీని కూడా అధిగమించి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2028 నాటికి భారత జీడీపీ 5,584.476 బిలియన్ డాలర్లకు చేరుతుందని, అదే సమయంలో జర్మనీ జీడీపీ 5,251.928 బిలియన్ డాలర్లుగా ఉంటుందని లెక్కగట్టింది. అంతకు ముందే, అంటే 2027 నాటికి, భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్ల (సుమారు 5,069.47 బిలియన్ డాలర్లు) మార్కును దాటుతుందని నివేదిక స్పష్టం చేసింది. ఇక ప్రపంచంలో అగ్రగామి ఆర్థిక వ్యవస్థల విషయానికొస్తే, 2025లో కూడా అమెరికా (30.5 ట్రిలియన్ డాలర్లు), చైనాలే (19.2 ట్రిలియన్ డాలర్లు) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతాయని ఐఎంఎఫ్ పేర్కొంది. ఈ దశాబ్దం చివరి వరకు ఈ స్థానాల్లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని అంచనా. ఇదిలా ఉండగా, ఐఎంఎఫ్ తన తాజా నివేదికలో 2025 సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి అంచనాను 6.2 శాతానికి స్వల్పంగా తగ్గించింది. జనవరిలో విడుదల చేసిన నివేదికలో ఈ అంచనా 6.5 శాతంగా ఉంది. పెరిగిన వాణిజ్య ఉద్రిక్తతలు, ప్రపంచ అనిశ్చితి కారణంగానే ఈ సవరణ చేసినట్లు ఐఎంఎఫ్ తెలిపింది. ముఖ్యంగా అమెరికా సుంకాల నిర్ణయాల వంటి అంశాలు ఈ అనిశ్చితికి కారణమవుతున్నాయని పేర్కొంది. అయినప్పటికీ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ వినియోగం బలంగా ఉండటం భారత వృద్ధికి ఊతమిస్తుందని నివేదిక పేర్కొంది. మరోవైపు, గత 80 ఏళ్లుగా కొనసాగుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ప్రపంచం ఓ కొత్త శకంలోకి అడుగుపెడుతోందని ఐఎంఎఫ్ తన నివేదికలో హెచ్చరించడం గమనార్హం. ఈ మారుతున్న క్రమంలో భారత్ కీలక ఆర్థిక శక్తిగా ఎదగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కేరళ తీరంలో లైబీరియా ఓడ మునక

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు): లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో శనివారం ప్రమాదానికి గురైంది. తాజాగా అది పూర్తిగా సముద్రంలో మునిగిపోయినట్లు ఇండియన్ కోస్ట్ గార్డ్ (ICG) ప్రకటించింది. ఈ నౌకలో 640 కంటైనర్లు ఉండగా.. వాటిలో 13 కంటైనర్లలో ప్రమాదకరమైన రసాయనాలు, 12 కంటైనర్లలో కాల్షియం కార్బైడ్, మిగిలిన వాటిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ ఉన్నట్లు తెలిపింది. ఇవి లీకైతే సముద్ర జలాలు తీవ్రంగా కలుషితమయ్యే ప్రమాదం ఉండడంతో అధికారులు కొచ్చి తీరంలో హై అలర్ట్ ప్రకటించారు. కంటైనర్లను, అందులోంచి బయటకు వచ్చిన ఇంధనం తీరంవైపునకు వస్తే తాకొద్దని ప్రజలను కేరళ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్ర జలాల్లో ఇంధనం లీకై ఎంత మేరకు వ్యాపించిందనే విషయాన్ని తెలుసుకోవడానికి ‘ఆయిల్ స్పిల్ మ్యాపింగ్ టెక్నాలజీ’ వినియోగించే విమానం సముద్రంపై చక్కర్లు కొడుతోందని అధికారులు తెలిపారు. ఈ ఘటన కారణంగా తలెత్తే పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రమాదంలో లైబీరియా నౌక

లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక శనివరం కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో తొలుత ఓ వైపునకు ఒరిగిపోయింది. దీంతో అందులోని కొన్ని కంటైనర్లు సముద్రంలో పడిపోయాయి. విఝింజమ్ పోర్టు నుంచి శుక్రవారం బయల్దేరిన 184 మీటర్ల పొడవున్న ఎంఎస్‌సీ ఎల్సా3 నౌక శనివారం మధ్యాహ్నానికి కొచ్చిన్ చేరుకోవాల్సి ఉండగా.. కంటైనర్ నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన ఇండియన్ కోస్ట్ గార్డ్ (ICG) వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. అందులో ఉన్న మొత్తం 24మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి చేర్చినట్లు అధికారులు పేర్కొన్నారు.



## సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ ఇక లేరు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు): సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. మందమర్రిలో సింగరేణి కార్మిక కుటుంబంలో జన్మించిన ఆయన జర్నలిస్టుగా, ఉద్యమకారుడిగా ఎండీ మునీర్ గుర్తింపు తెచ్చుకున్నారు. వామపక్ష భావజాలంతో అనేక విప్లవ ఉద్యమాలు నడిపారు.



ప్రధానంగా సింగరేణిలో జర్నలిస్టుగా కార్మికుల పక్షాన నిలిచారు. ఈ సమయంలో పలు పత్రికల్లో పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి జేఏసీ చైర్మన్‌గా ఉండి ప్రత్యేక రాష్ట్ర సాధనకై ఉద్యమ సంఘాలను ఏకం చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం సాయంత్రం మునీర్ అంత్యక్రియలు మంచిర్యాల జిల్లా స్వగ్రామం మందమర్రిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సీనియర్ పాత్రికేయుడు ఎండీ మునీర్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలియజేశారు. వృత్తి పట్ల నిబద్ధత, సామాజిక ఉద్యమాల పట్ల అంకితభావం కలిగిన ఆయన మరణం పాత్రికేయ లోకానికి తీరని లోటు అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ సందర్భంగా మునీర్ కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సింగరేణి కార్మికుల నడుమ జీవిస్తూ, వారి సమస్యలను వెలుగులోకి తెస్తూ, నిబద్ధత కలిగిన పాత్రికేయునిగా సుదీర్ఘ కాలం పనిచేసిన మునీర్ కృషి గొప్పదన్నారు. టీజేఎఫ్ నేతగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటంలో సింగరేణి ప్రాంత ప్రజా సంఘాలను ఉద్యమ శక్తులను సమన్వయం చేయడంలో వారిని చైతన్యపరచడంలో జర్నలిస్టుగా ఎండీ మునీర్ సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. మునీర్ కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాగా, జర్నలిస్ట్ మునీర్ మృతి పట్ల పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, కేటీఆర్, సీనియర్ నేతలు, సింగరేణి అధికారులు, జర్నలిస్టులు, కార్మిక సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

## సున్నిత అంశాల్లో మాటల జాగ్రత్తలు పాటించండి

### బీజేపీ నాయకులకు ప్రధాని సూచన




- నాయకులు ప్రజల్లో చేసే ప్రతి వ్యాఖ్య బాధ్యతాయుతంగా ఉండాలన్న హెచ్చరిక
- "ఎక్కడైనా, ఏదైనా మాట్లాడవచ్చు" అన్న ధోరణిని మోనివేయాలని హెచ్చరింపు
- వివాదాస్పద వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేస్తాయి
- ఆపరేషన్ సిందూర్‌పై వ్యాఖ్యలతో అపార్థాలు
- మధ్యప్రదేశ్ బీజేపీ నేతల వివాదాస్పద వ్యాఖ్యలపై ఆగ్రహం
- ఎన్డీయే సీఎంలు, డిప్యూటీ సీఎంలతో ప్రధాని సమీక్ష
- పాకిస్తాన్ విజ్ఞప్తితో సీజ్‌ఫైర్, భారతదేశమే తుది నిర్ణయం తీసుకుందని మోదీ స్పష్టం

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు): ఆదివారం ఢిల్లీలో ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో సమావేశం జరిగింది. ఈ భేటీలో నేతలు నిర్లక్ష్యంగా వ్యాఖ్యలు చేయొద్దని మోదీ వార్నింగ్ ఇచ్చారు. వివాదాస్పద విషయాలపై మౌనంగా ఉండాలని తెలిపారు. ప్రజా సమక్షంలో నాయకులు చేసే వ్యాఖ్యల్లో అణుకువ, బాధ్యత ఉండాలని హితవు పలికారు. ఎక్కడైనా, ఏదైనా మాట్లాడవచ్చు అనే ధోరణికి దూరంగా ఉండాలని, అనవసర వ్యాఖ్యలు పార్టీకి ప్రతికూలంగా మారతాయని హెచ్చరించారు. ఇటీవలి కాలంలో మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాల బీజేపీ నాయకులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ‘ఆపరేషన్ సిందూర్’పై చేసిన వ్యాఖ్యలు పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించాయని పేర్కొన్నారు.

మిగతా 2లో..



## సరస్వతి పుష్కరాల్లో గవర్నర్ దంపతులు



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో నేడు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు పాల్గొన్నారు. త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం చేసి, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పుష్కరాలు రాష్ట్ర సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అద్భుతమైన పుష్కర ఏర్పాట్లు చేసిందని ప్రశంసించారు. కాగా మే 15 నుండి మే 26 వరకు తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో జరుగుతున్నాయి.

ఈ పవిత్ర 12 రోజుల ఉత్సవంలో గోదావరి, ప్రాణహిత, భూగర్భ సరస్వతీ నదుల త్రివేణీ సంగమంలో భక్తులు పుష్కర స్నానం చేస్తారు. తెలంగాణ ప్రభుత్వం TGSRTC ద్వారా రాష్ట్రం నలుమూలల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఆధునిక సౌకర్యాలతో కూడిన డిజిటల్ యాప్(సరస్వతీ పుష్కరాలు 2025), స్నాన ఘట్టాలు, వైద్య సౌకర్యాలు, పార్కింగ్ వంటివి ఏర్పాటు చేసింది. కాగా ఈ పుష్కరాలు రేపటితో ముగుస్తుండటంతో కాళేశ్వరానికి భక్తులు పోటెత్తారు. భారీ సంఖ్యలో వాహనాలు రావడంతో మహాదేవపురంకాళేశ్వరం రూట్ లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు 15 కిమీల మేర వాహనాలు ట్రాఫిక్ జాంలో ఇరుక్కుపోయాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సున్నిత అంశాల్లో మాటల జాగ్రత్తలు పాటించండి

(మొదటి పేజీ తరువాయి)

మధ్యప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే విజయ్ షా కల్నల్ సోఫియా ఖురేషీపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. అలాగే మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం జగదీష్ దేవ్‌డా చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. 'యావత్తు దేశ ప్రజలు, జవాన్లు తలలు వంచి ప్రధాని మోదీ పాదాల వద్ద మోకరిల్లారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ జవాబిచ్చిన తీరును ప్రశంసించడానికి మాటలు చాలవు అని వ్యాఖ్యానించారు. ఇలా ఆపరేషన్ సిందూర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో తాజా, ఎన్డీయే సమావేశంలో బీజేపీ నేతలకు ప్రధాని మోదీ పై ఆదేశాలు జారీ చేశారు.
ఈ ఎన్డీయే సమావేశంలో ఆపరేషన్ సిందూర్‌పై స్పష్టత ఇచ్చిన మోదీ.. కాల్పుల విరమణ ఒప్పందంలో దేశానిదే తుది నిర్ణయం. పాకిస్తాన్ విజ్ఞప్తి మేరకు సీజ్‌ఫైర్‌కు అంగీకరించాం. భారత్‌పాక్ కాల్పుల విరమణ ఒప్పందంలో మరే ఇతర దేశం జోక్యం చేసుకోలేదన్నారు.

## 'ఆపరేషన్ సింధూర్' గర్వకారణం: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఆపరేషన్ సింధూర్ విజయవంతమయ్యాక దేశంలోని పలు ప్రాంతాల్లో త్రివర్ణ పతాకాలతో ర్యాలీలు నిర్వహించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం బీహార్‌లోని కతిహార్, యూపీలోని కుషినగర్ తదితర ప్రాంతాల్లో జన్మించిన చిన్నారులకు 'సిందూర్' అనే పేరు పెట్టారని అన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులకు ప్రధాని మోదీ హెచ్చరిక జారీ చేశారు. ఈ దారుణ చర్యకు పాల్పడినవారు, కుట్రదారులకు కఠినమైన ప్రతిస్పందన ఎదురవుతుందని హెచ్చరించారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడి ప్రతి పౌరుడిని కలచివేసిందన్నారు. ఉగ్రవాదంపై జరిగిన ఈ యుద్ధానికి దేశంలోని 140 కోట్ల మంది భారతీయులు సంఘీభావం ప్రకటించారని ప్రధాని గుర్తుచేశారు. కాగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోని కటేఝరి గ్రామానికి బస్సు రాకతో అక్కడి ప్రజలు సంబరాలు చేసుకున్నారన్నారు. ఈ గ్రామం మావోయిస్టుల హింసకు గురైందని, గ్రామానికి తొలిసారిగా బస్సు చేరుకున్నప్పుడు ఘనంగా స్వాగతించారని అన్నారు. గత మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ భారత స్వాతంత్ర్య పోరాటంలో ఏప్రిల్, మే నెలల ప్రాముఖ్యతను తెలియజెప్పారు. నాటి స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను వివరించారు.

## ఈ–సెట్‌లో 17,766 మంది పాస్

**తెలంగాణ ఈసెట్–2025లో 17,766 మంది అర్హత సాధించారు. ఈసెట్ ఫలితాలను ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి ఆదివారం విడుదల చేశారు. పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ మేథ్స్ కోర్సు ద్వారా ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈసెట్)ను ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. 19,672 మంది దరఖాస్తు చేసుకోగా, 18,928 మంది పరీక్ష రాశారు. వీరిలో 17,768 (93.87 శాతం) అర్హత సాధించారు. ఈ సెట్ ద్వారా ఇంజనీరింగ్ రెండో సంవత్సరం (లేటరల్ ఎంట్రీ)లో చేరేందుకు అవకాశం లభిస్తుంది. మొత్తం పది బ్రాంచీలకు జరిగిన సెట్‌లో బాలురు 10,972 మంది, బాలికలు 6,796 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా ఉన్నారు. నాన్–లోకల్ కోటా ఎత్తివేయడంతో వారికి తెలంగాణలో ఇంజనీరింగ్‌లో ప్రవేశం ఉండదు. త్వరలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ ఎం, సెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఈ.పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.**



## పరిశ్రమల ద్వారా ఉపాధి, ఆదాయానికి బాటలు: భట్టి విక్రమార్క

**రాష్ట్రం నుంచి పరిశ్రమలు వెళ్ళకుండా చర్యలు తీసుకోండి: డిప్యూటీ సీఎం ఆదేశం**


(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు): యువతకు ఉపాధి కల్పించడంతో పాటు ఖజానాకు ఆదాయం సమకూర్చే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం ప్రజాభవన్‌లో పారిశ్రామిక పెట్టుబడులకు ప్రోత్సాహంపై సబ్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో పెట్టుబడులకు ప్రోత్సాహం, ఇప్పటికే చేసుకున్న ఎంవోయూల అమలులో ప్రగతి, కొత్త యూనిట్ల స్థాపనకు సంబంధించిన అంశాలపై చర్చించారు.ఒక పరిశ్రమ స్థాపిస్తే అందుకు అనుబంధంగా పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్న ప్రతిపాదనలపై దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన ఆచరణలోకి తీసుకురావాలని భట్టి అధికారులకు సూచించారు. ఇకపై ప్రతి శనివారం పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. ఒక పరిశ్రమ ఏర్పాటుతో అనేక అనుబంధ పరిశ్రమలు రావడం తద్వారా రాష్ట్ర యువతకు వేల సంఖ్యలో ఉద్యోగాలు, రాష్ట్ర ఖజానాకు భారీ ఆదాయం సమకూరే వ్యూహాత్మక ప్రాధాన్యతను అధికారులు దృష్టిలో పెట్టుకొని ఆ రకమైన ప్రతిపాదనలపై కసరత్తు చేయాలని సబ్ కమిటీ సూచించింది. జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతంలో హ్యుందాయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ స్థాపనకు సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. 675 ఎకరాల్లో రూ. 8,528 కోట్ల పెట్టుబడితో ఈ కంపెనీ రాష్ట్రానికి రావడం గొప్ప విజయమని కమిటీ అభిప్రాయపడింది. ఈ సెంటర్ ఏర్పాటుతో కొత్తగా 4,276 మంది రాష్ట్ర యువతకు ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు సమావేశంలో వివరించారు. రీసెర్చ్ సెంటర్‌లో ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్, పైలట్ లైన్, ప్రోటో టైపింగ్ ఉంటాయని వివరించారు. ప్రస్తుతం ప్రారంభమవనున్న పరిశ్రమలు రాబోయే కాలంలో భారీగా ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పిస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.



## కుప్పంలో ఘనంగా ఏపీ సీఎం చంద్రబాబు గృహప్రవేశం

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)





చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం శివపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు గృహప్రవేశ కార్యక్రమం వేడుకగా జరిగింది. నూతనంగా నిర్మించిన ఇంట్లోకి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు వెళ్లారు. ఈ కార్యక్రమంలో లోకేశ్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇవాళ ఉదయం 5 గంటలకు పాలు పొంగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గృహప్రవేశానికి హాజరయ్యారు. రాత్రికి నూతన గృహంలోనే చంద్రబాబు బస చేయనున్నారు. సీఎం పర్యటన సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శివపురం, పీఈఎస్ వైద్య కళాశాలతో పాటు వి.కోట కుప్పం జాతీయ రహదారిలో బలగాలను మోహరించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలను మళ్లించారు. కుప్పంలో సొంతిల్లు కట్టుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆనందం వ్యక్తం చేశారు. ఈ గృహప్రవేశం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రజల మధ్య జరిగిన శుభకార్యం తనకు ఎప్పటికి గుర్తుండిపోతుందని తెలిపారు. 36 ఏళ్లుగా తమ కుటుంబానికి అండగా ఉంటూ ముందుకు నడిపిస్తున్న ప్రజల ఆశీస్సుల మధ్య కార్యక్రమం జరగడం మరచిపోలేమని లోకేశ్ పేర్కొన్నారు. సొంతింటి పండుగలా తరలివచ్చిన నియోజకవర్గం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కుప్పం ప్రజలు చూపించిన ప్రేమ, ఆప్యాయత మరువలేనిదని చెప్పారు. ఇది తమ కుటుంబ పండుగ కాదని అందరి పండుగన్నారు. ప్రతి అడుగులో తమ కుటుంబానికి తోడుగా ఉన్న అందరికి హృదయపూర్వక కృతజ్ఞతలని తెలియజేశారు. మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ తమకు దీవెనగా నిలుస్తాయని లోకేశ్ ట్వీట్‌చేశారు. గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరైన అతిథులు, నేతలు, కార్యకర్తలకు అల్పాహారం, భోజనం ఏర్పాటు చేశారు.



## యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ రైలు ప్రాజెక్ట్‌కు ఊపిరిపోసిన కేంద్రం – త్వరలో పనుల ప్రారంభం

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)




**గంటలోనే యాదాద్రికి : హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట 65 కిలోమీటర్ల దూరంలో ఉంది. రోడ్డు మార్గంలో వెళ్లే భక్తులకు ఒక్కో టికెట్‌కు గరిష్ఠంగా రూ.150 ఉంటుంది. యాదగిరిగుట్టకు చేరుకోడానికి రెండు గంటల మేర సమయం పడుతోంది. అదే ఎంఎంటీఎస్ అందుబాటులోకి వస్తే, కేవలం రూ.20 మాత్రమే చెల్లించి, సికింద్రాబాద్ నుంచి 45 నుంచి 1 గంట వ్యవధిలో యాదాద్రికి చేరుకునే అవకాశముంది.**

యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ రైలు ప్రాజెక్ట్ కోసం నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం' అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్టుపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దశాబ్దాల నుంచి యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ రైలు సేవలు ఆగుతూ, సాగుతూ ఊరిస్తున్న క్రమంలో కేంద్రమంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవలే ఎంఎంటీఎస్ రెండో దశ పూర్తయింది. ఇప్పటికే చర్లపల్లి టెర్మినల్ , బేగంపేట రైల్వేస్టేషన్లు ప్రారంభమయ్యాయి. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద ఘట్‌కేసర్ నుంచి రాయగిరి (యాదాద్రి) వరకు ఎంఎంటీఎస్ విస్తరణపై కేంద్రం దృష్టి సారించిన క్రమంలో ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. జూన్‌లో ప్రాథమిక పనులు ప్రారంభం కానున్నట్లు ప్రకటించారు.

ప్రాజెక్టు పనులు వెంటనే చేపట్టాలి : యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ ప్రాజెక్టు పనులు వెంటనే చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఘట్‌కేసర్ నుంచి యాదగిరిగుట్టకు రోజూ 50 వేల పైచిలుకు మంది రాకపోకలు సాగిస్తుంటారని, ఎంఎంటీఎస్ షటిల్ సర్వీసులు ప్రారంభించాలని, స్థల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ప్రకటించారు.

రూ.50 కోట్లతో సర్వేలు : యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ సందర్శనకు రాష్ట్ర రాజధాని (హైదరాబాద్) నుంచి వచ్చే యాత్రికులకు త్వరితగతిన దర్శనం కల్పించేలా ఎంఎంటీఎస్ రైలు సదుపాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశాబ్దాల నుంచి ప్రతిపాదనలు మాత్రమే సిద్ధం చేశాయి. గతంలో రూ.50 కోట్లతో డీపీఆర్, రైల్వే లైన్ పనులకు సర్వేలు నిర్వహించాయి.

నిధులు మంజూరు కాకపోవడంతోనే : 2004 నుంచి ఎంత మంది ముఖ్యమంత్రులు మారినా, అప్పటి సీఎం వైఎస్ నుంచి ఇప్పుడున్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిల వరకు ప్రతిసారి ఎంఎంటీఎస్ విస్తరణ పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ నిధులు మాత్రం మంజూరు కాకపోవడంతో పనులు పట్టాలెక్కలేదు. ప్రభుత్వం మొదట్లో సికింద్రాబాద్ నుంచి భువనగిరి వరకు ఎంఎంటీఎస్ విస్తరిస్తామని ప్రకటించింది. క్రమంగా ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి స్టేషన్ వరకు పొడిగించాలని నిర్ణయం తీసుకుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 2016లోనే రూ.330 కోట్ల అంచనా నిర్మాణ వ్యయంతో అప్పట్లో ఎంఎంటీఎస్ ప్రతిపాదనలు తీసుకొచ్చారు. ఇందులో రూ.200 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, మిగిలిన నిధులు కేంద్రం భరించేలా ప్రతిపాదనలు సైతం తయారు చేసి పంపారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు కేటాయించడంలో జాప్యం నెలకొనడంతో ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. 2023లో మరోసారి ఎంఎంటీఎస్ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వమే చేపట్టేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.330 కోట్ల నుంచి రూ.464 కోట్లకు పెరిగింది. ఎంఎంటీఎస్ విస్తరణలో భాగంగానే ఘట్‌కేసర్‌యాదాద్రి మధ్య 33 కి.మీల మేర మూడో రైల్వేలైన్ నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంట్‌లో ఇటీవలే ప్రకటించారు.

## భారీ వర్షాలతో దిల్లీ, కేరళలో అతలాకుతలం


- ధౌలా కువాన్, నానక్ పురా ప్రాంతాల్లో వాహనదారులకు విపరీతమైన ఇబ్బందులు
- విమానాల రాకపోకలకు తీవ్ర ఆటంకం – ప్రయాణికులకు అప్రమత్తతా సూచనలు
- విమానాశ్రయానికి అనుసంధానమైన అండర్‌పాస్‌లలో వరద ఉధృతి
- వాతావరణ శాఖ హెచ్చరిక – గరిష్ఠ వేగంతో ఈదురుగాలులు, అతి భారీ వర్షం
- కేరళలో రుతుపవనాల ప్రభావంతో విస్తృత వర్షపాతం
- కాసర్‌గోడ్, కన్నూర్ సహా ఐదు జిల్లాల్లో రెడ్ అలర్ట్ – ప్రజలకు ఇళ్లలోనే ఉండాలని సూచన
- మహారాష్ట్ర, రాజస్థాన్‌లో కూడా వర్షా ల ప్రభావం కనిపిస్తోంది

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)



దేశ రాజధాని దిల్లీని భారీ వర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. వర్షానికి పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన కూడళ్లు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. అనేక ప్రాంతాల్లో రహదారులు నీటమునగడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ధౌలా కువాన్, సుబ్రోతో పార్క్, నానక్ పురాలో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దిల్లీ కంటోన్మెంట్ లోని లోతట్టు ప్రాంతాల్లో భారీగా వర్షం పడటంతో ఓ బస్సు, కారు వరద నీటిలో చిక్కుకుపోయాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి అక్బర్ రోడ్డు సమీపంలో చెట్లు నేలకొరిగాయి. ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ప్రతికూల వాతవారణం వల్ల దిల్లీకి పలు విమానాల రాకపోకలకు ఆలస్యం అవుతోంది. దాదాపు 180కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, మరో మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది ఎయిర్‌పోర్టు. విమానాల సమయాలను సంబంధిత వెబ్‌సైట్లలో చెక్ చేసుకోవాలని సలహా ఇచ్చింది. అటు ఎయిరిండియా, ఇండిగో కూడా ప్రయాణికులను అప్రమత్తం చేశాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని చెప్పాయి.అంతకుముందు శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి దిల్లీ నగరాన్ని విమానాశ్రయానికి అనుసంధానించే ప్రధాన అండర్‌పాస్ జలమయమైంది. ఫలితంగా డజన్ల కొద్దీ కార్లు, బస్సులు నీటమునిగాయి. ముఖ్యంగా రానున్న కొన్ని గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అంచనా వేసింది.మరోవైపు రుతుపవనాల రాకతో కేరళలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల చెట్లు,విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రోడ్లన్నీ వరద నీటితో జలమయమవ్వగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే కాసర్‌గోడ్, కన్నూర్, కోజికోడ్, వయనాడ్, మలప్పురం జిల్లాల్లో అధికారులు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. మిగిలిన అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. వచ్చే నాలుగు రోజులు కేరళలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లు వదిలి రావద్దని సూచించింది. మహారాష్ట్ర, రాజస్థాన్‌లో కూడా వర్షాలు కురుస్తున్నాయి.





# దళితుల ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనం కాంగ్రెస్ పార్టీ

- ఇందిరమ్మ ఇళ్లలో అత్యధికంగా దళితులకు కేటాయింపు
- అవకాశం వచ్చినప్పుడు మనమే మనవాళ్లను బలపరచాలి
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**లింగాల ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:** దళితులకు రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థిరత్వాన్ని అందించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఆదివారం లింగాల ఘనపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, గత ప్రభుత్వాల్లో దళితులపై జరిగిన అన్యాయాన్ని విపులంగా వివరించారు. ఇందిరా గాంధీ నాయకత్వం దళితుల ఆత్మగౌరవానికి మూలాధారం

ఇందిరా గాంధీ హయాంలోనే మాదిగల ఆత్మగౌరవం పరిరక్షించబడిందని, ఆ సిద్ధాంతాన్ని కొనసాగిస్తున్నదే కాంగ్రెస్ పార్టీ అని శ్రీహరి గుర్తు చేశారు. దళితులకు రాజ్యాంగబద్ధ హక్కులను అందించిన అంబేద్కర్ గారు లేకపోతే, ఈ స్థాయికి వచ్చే అవకాశం ఉండేది కాదని చెప్పారు. రాజ్యాంగం వల్లే దళితులు నేటి సమాజంలో గౌరవంగా నిలబడ్డారని తెలిపారు.

అవకాశాల వినియోగంపై స్పష్టమైన సందేశం

"అందరికీ అవకాశాలు ఒకేసారి రావు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే గుర్తింపు వస్తుంది. దుర్వినియోగం చేస్తే కనుమరుగవుతారు," అని హితవు పలికారు. "ఒకరికొకరం సహకరించుకోవాలి. మనవాళ్లకు మనమే అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. అవకాశాన్ని పొందిన వారు పనిచేసే అవకాశం లేకుండా చేసే రాజకీయ వ్యవస్థను ప్రశ్నించారు.

తనపై వచ్చిన ఆరోపణలపై బహిరంగ సవాల్

తన రాజకీయ జీవితం 30 ఏళ్లుగా నిర్దోషంగా సాగిందని, ఇప్పటిదాకా తనపై అవినీతి ఆరోపణలు చేయగలిగినవారు ఎవరూ లేరని ధీమాగా చెప్పారు. "రెండు వేల ఎకరాలు కబ్జా చేశానన్న ఆరోపణలు, బీఆర్ఎస్ బీ ఫాం కోసం డబ్బులు తీసుకున్నానన్న ఆరోపణలు చేసినవారు ఏమీ నిరూపించలేకపోయారు. నిజంగా నిరూపిస్తే పదవికి రాజీనామా చేసి వాళ్ల ఇళ్లలో గులాంగా పని చేస్తా," అని సవాల్ విసిరారు.

ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు పెద్ద పీట

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో మంజూరైన 3500 ఇళ్లలో 1500 ఇళ్లు దళితులకు కేటాయించినట్లు వెల్లడించారు. అలాగే, లింగాల ఘనపూర్ మండలానికి రాజీవ్ యువ వికాసం పథకం కింద మంజూరైన 640 యూనిట్లలో పార్టీకోసం కృషి చేస్తున్నవారికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నేతలపై తీవ్ర విమర్శలు

గత ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని నేతృత్వం వహించిన ఎమ్మెల్యే పథకాలను, పదవులను అమ్ముకున్నాడని, దళిత బంధు అమలులో దళితులను మోసం చేశాడని ఆరోపించారు. ఇప్పుడు ఆయనను బీఆర్ఎస్ కేవలం కడియం శ్రీహరిని తిట్టించే వ్యక్తిగా మాత్రమే తీసుకుందని విమర్శించారు.

సమాన హక్కుల సాధన కోసం కాంగ్రెస్ కృషి

"తెలంగాణలో షెడ్యూల్ కులాల వర్గీకరణ చేసి చట్టబద్ధత కల్పించిన ప్రభుత్వం కాంగ్రెస్‌దే" అని గుర్తు చేశారు. దళితుల శ్రేయస్సే తన ముఖ్య ధ్యేయమని, తాను ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం ఏ ఒక్క దళిత బిడ్డకూ అన్యాయం జరగనివ్వరని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సభా అధ్యక్షుడు గుగ్గిళ్ల నర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నర్సింగ రమేష్, మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, మండల మాజీ ప్రజాప్రతినిధులు, సమన్వయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- వెలిజర్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**షాద్ నగర్,తెలంగాణ ముచ్చట్లు:** పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెలిజర్ల కాంగ్రెస్ పార్టీ నేతలు తెలిపారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన జరగింది. లబ్ధిదారులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ - ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని తెలిపారు. పేదల అభివృద్ధే తమ ప్రథమ విధేయత అని పేర్కొన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ పాలనలోనే పెద్ద సంఖ్యలో ఇళ్లు మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిబద్ధతతో పని చేస్తున్నారని నేతలు తెలిపారు. పేదల కోసం రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వాడ్యాల నర్సింహా రెడ్డి, అనిమి చిన్న శివరాజ్ గౌడ్, జాంగారి రవి, కటికెల మంగమ్మ, తిరుపతి యాదవ్, పాత్లవత్ లక్ష్మి రఘు, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వాడ్యాల శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, సీనియర్ నేతలు అనిమి గణేష్ గౌడ్, చాకలి కృష్ణ, కటికెల తిరుపతి యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాంగారి నర్సింహులు, మందాడి ముకుంద గౌడ్, తుప్పారీ శేఖర్, మట్ట వెంకటేష్ గౌడ్, జనుముల యాదయ్య, కావాలి యాదయ్య, దామర్లపల్లి యాదయ్య, దిర్షనం వెంకటేష్, మంద రాజు, కొత్త రాఘవేందర్, వట్టేల మహేష్ యాదవ్, అన్వర్, యాదయ్య, మంగలి ప్రవీణ్, పత్లవత్ రవి, దిర్షణం సాయి, జాంగారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# ముత్యాలమ్మ బోనాల జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

## కోత్తపేటలో ఘనంగా నిర్వహించిన బోనాల పండుగ

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధిలోని కొత్తపేట శివారులో ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ వేడుకలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, గ్రామ ప్రజల శాంతి శుభాకాంక్షలకై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జన్ను శీభరాణి - అనీల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బుద్దె పెద్దన్న, రైతు రాజు, గాదె రాము, బిజిలి సంపత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు. భక్తుల ఉత్సాహం, ప్రత్యేక అలంకరణలు, సాంప్రదాయ సంగీతంతో ఆలయం చుట్టూ పండుగ వాతావరణం నెలకొంది.



# ప్రశాంతంగా యూపీఎస్సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్ష

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:** హనుమకొండ జిల్లా లోని వివిధ పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన యూపీఎస్సి సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 4141మంది అభ్యర్థులు పది పరీక్షా కేంద్రాలను కేటాయించగా ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకూ జరిగిన మొదటి సెషన్ పరీక్షకు 2435 మంది అభ్యర్థుల హాజరై పరీక్ష రాశారు. 1706మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2:30 నుండి 4:30 గంటల వరకు జరిగిన రెండో సెషన్ పరీక్షకు 2422 మంది పరీక్ష రాశారు. 1719మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహిస్తున్న పలు పరీక్షా కేంద్రాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సందర్శించారు. వడ్డేపల్లి లోని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలోని ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు తీసుకున్న చర్యల గురించి ఆయా పరీక్షా కేంద్రాలకు సంబంధించిన అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

# రైతులకు జిలుగు విత్తనాలు అందుబాటులో...

**జిల్లా వ్యవసాయ అధికారి వినయ్**




**మెదక్ జిల్లా బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:** జిల్లాలో రైతులకు జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలపై జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మెదక్ జిల్లాకు 15 వేల క్వింటాల జనము , 30, వేల క్వింటాల జీలుగు విత్తనాలకు సరఫరాకు గాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది అన్నారు. ప్రస్తుతం మెదక్ జిల్లాకు 15 వందల క్వింటాల జనము, 05 వేల క్వింటాల జీలుగు విత్తనాలు ప్రభుత్వం తరఫున అందుబాటులో ఉంచామన్నారు.

వరి నాట్లు ఎక్కడైతే ముందు జరుగుతాయో ఆ మండలాల్లో ప్రాథమిక సహకార సంఘాలు, రైతు ఆగ్రోస్ కేంద్రాల వద్ద పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మిగతా మండలాలకు నాలుగు రోజుల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నేలకు, పంటకు మేలు చేసే పచ్చిరొట్ట ఎరువును తయారు చేసేందుకు ప్రభుత్వం జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేస్తూ వస్తున్నది. పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు ఉన్న రైతుకు మాత్రం 50 శాతం వరకు సబ్సిడీపై అందుతుందన్నారు.

రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతిలో భూసారాన్ని పెంచే దిశగా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

# విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలి

- గుర్తింపు పొందిన కంపెనీ ప్యాకింగ్, లేబుల్ తనిఖీ చేసుకోవాలి
- రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం విత్తన సంస్తల, డీలర్ల బాధ్యత
- జిల్లా ఎస్పీ డి. ఉదయ్ కుమార్ రెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:** నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోవద్దు, వ్యవసాయ పనులు ప్రారంభించడానికి రైతులు సిద్ధమౌతున్నారు, అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి, నకిలీ విత్తనాలు గుర్తించి సీజ్ చేయాలి, నకిలీ విత్తనాల వల్ల జిల్లాలో ఒక్క రైతు కూడా నష్టపోవద్దు అని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈసందర్బంగా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ. సంభందిత అధికారులు అందరూ సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా జరగకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల నిర్మూలనకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగినది. కష్టపడే రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై పై ఉన్నది, విత్తన వ్యాపార డీలర్స్ బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి అన్నారు. రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తాము, ముందస్తు తనిఖీలు, రైతులకు అవగాహన కల్పించడం, డీలర్స్ కు అవగాహన కల్పించడం, రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలి, గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్న వారి పై నిఘా ఉంచాలి అని ఆదేశించారు. రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి అని ఎస్పీ గారు విజ్ఞప్తి చేసినారు. నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలి, లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దు అని కోరినారు, తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లోకి వచ్చే మధ్యవర్తుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేయవద్దు, ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్స్ నుండి విత్తనాలు కొనుగోలు చేస్తే మంచిది అన్నారు. ఇతర రాష్ట్రాల నుండి & ఇతర జిల్లాల నుండి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాల గురించి, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీసులకు లేదా 100 నెంబర్ కి కాల్ చేయాలన్నారు. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక





# నేనున్నా... అధైర్య పడకండి..

**మూగజీవాలు కోల్పోయిన రైతులకు అండగా మంత్రి పొంగులేటి..**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** నేనున్నానని... అధైర్య పడకండని.. 75 మూగజీవాలు కోల్పోయిన రైతులతో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.. ఆదివారం మధ్యాహ్నం పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు తండా గ్రామంలో కొందరి రైతులకు చెందిన సుమారు 75మేకలు మృత్యువాత పడ్డాయి.. మేతకు వెళ్లిన మేకలు మృత్యువాత పడడంతో రైతుల ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి.. దీంతో స్థానిక గిరిజన రైతులు కన్నీరు మున్నీరయ్యారు.. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాధిక్ అలీ తదితరులు రైతులను ఓదార్చి మూగజీవాల ఘటనను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ రామ హాయం రఘురాం రెడ్డి తక్షణమే రైతులకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తామని ఫోన్ ద్వారా రైతులకు హామీ ఇచ్చారు.



# చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాగరాజు

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**

వర్ధన్నపేట పట్టణ శివారులోని లక్ష్మి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన నూతన వస్త్రఫలంకరణ కార్యక్రమం వేడుకలతో జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిటూరు రాజు కుమార్తెలు రమ్యశ్రీ, జయశ్రీల నూతన వస్త్రధారణ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారులకు శుభాకాంక్షలు తెలుపుతూ, కుటుంబానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆత్మీయులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ వైద్య పరిశోధనలో తెల్దారుపల్లి వాసికి డాక్టరేట్


**తండ్రి బాటలో తనయుడు**
**కన్నెగంటి ప్రవీణ్ కుమార్**



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** గత నాలుగు సంవత్సరాలుగా కెమిస్ట్రీ విభాగంలో క్యాన్సర్ వైద్యంలో వాడే మందుల కెమికల్ కాంబినేషన్స్ పై కన్నెకంటి ప్రవీణ్ కుమార్ చేసిన పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందాయి. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన కన్నెకంటి ప్రవీణ్ కుమార్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ హైదరాబాద్ లో రసాయనశాస్త్ర విభాగంలో "డిజైన్ అండ్ సింతసిస్ ఆఫ్ న్యూ ఇమిడజోల్ డెరివేటివ్స్ యాస్ యాంటి క్యాన్సర్ ఏజెంట్స్" అనే అంశంపై చేసిన పరిశోధనలు ఉత్తమ ఫలితాలు అందించడంతో ఈ నెల 22న హైదరాబాద్ లో డాక్టరేట్ అందుకున్నాడు. ప్రొఫెసర్ టి.నర్సింహస్వామి పర్యవేక్షణలో హైదరాబాద్ లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ సైన్సెస్(ఐఐసిటి), సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజి (సిసియంబి) సహకారంతో తాను చేసిన పరిశోధనల ఫలితాలను అత్యంత ప్రతిష్టాత్మకమైన జర్నల్ ఆఫ్ మాలిక్యులార్ స్ట్రక్చర్ (ఎల్స్వియర్)సైన్స్ మ్యాగ్జైన్ లో వెల్లడించగా ఉత్తమ పరిశోధనగా ప్రశంసలు పొందింది. క్యాన్సర్ వ్యాధి ట్రీట్మెంట్ లో వాడే మందులపై తాను చేసిన ప్రయోగాల ఆధారంగా తయారుచేసే మందులవలన క్యాన్సర్ వ్యాధిని సమర్ధవంతంగా ఎదుర్కోవచ్చునని శాస్త్రీయంగా నిరూపించాడు. క్యాన్సర్ వైద్యంలో ప్రస్తుతం వాడుతున్న మందులలో వాడే రసాయనాల కాంబినేషన్స్ కంటే తాను సూచించిన రసాయనాల మిశ్రమాన్ని తగు మోతాదుల్లో వాడితే క్యాన్సర్ వ్యాధిని సమర్ధవంతంగా ఎదుర్కోవచ్చునని శాస్త్రీయంగా నిరూపించినట్లు ప్రవీణ్ ఈ సందర్భంగా తెలిపాడు.'యాంటి ప్రోస్టేట్ క్యాన్సర్','హ్యూమన్ లంగ్ క్యాన్సర్',బ్రెస్ట్ క్యాన్సర్ పై పరిశోధనా పత్రాలు అత్యంత ప్రామాణికంగా వెలువరించినట్లు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శంకర్ లింగం, చైర్మన్ పురుషోత్తమ రెడ్డి వెల్లడించారు. ప్రవీణ్ కుమార్ ప్రాధమిక విద్యను సాంఘిక సంక్షేమ గురుకులంలో చదవడం గమనార్హం. అంతర్జాతీయ స్థాయిలో సంక్షేమ గురుకులాల సత్తా చాటడం అభినందనీయమని తెలంగాణ గురుకుల ఆల్ రెసిడెన్సియల్ ఎంప్లాఈస్ అసోసియేషన్ మల్టీ జోనల్ అధ్యక్షుడు ఐనాల సైదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, దమ్మపేటలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న డాక్టర్ కన్నెకంటి వెంకటేశ్వర్లు తన ఇద్దరు పిల్లలు (ప్రవీణ్ కుమార్, ప్రతిభ)లను గురుకులాల్లోనే చదివించి ఆదర్శంగా నిలిచారన్నారు. కూతురు కన్నెకంటి ప్రతిభ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆప్తమాలజి లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి పారా ఆప్తాల్మిక్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగం సాధించగా కొడుకు ప్రవీణ్ కుమార్ కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించి నేటి గురుకుల విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఉద్యోగం చేస్తూ ఎకనమిక్స్ లో డాక్టరేట్ సాధించి తన గ్రామంలోని తోటివారికి స్ఫూర్తినిచ్చిన కన్నెకంటి వెంకటేశ్వర్లు తన ఇద్దరు పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ ను పలువురు గురుకుల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఐనాల సైదులు, దూలం యల్లయ్య, శ్రీనివాసులు, ఉషారత్నం, యల్.ఉపేందర్, మిరియాల ధర్మారావు, మధన్ లాల్, నాగరాజు, రామారావు, ఐ.భగవత్, మేళ్ళచెర్వు జానకి, సౌగంధి యసస్విని, సాయిలిఖిత, ప్రతిభ, రూప్ సింగ్ పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన ట్రాఫిక్ సిఐ వెంకన్న

**కాజీపేట్ తెలంగాణ ముచ్చట్లు:**




కాజీపేట్ ట్రాఫిక్ సిఐ గా పి. వెంకన్న ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. వెంకన్న ఏ హెచ్ టి యు నుండి కాజీపేటకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఉన్న సిఐ నాగబాబు భద్రాద్రి, కొత్తగూడెం లోని మణుగూరుకు బదిలీపై వెళ్లారు.

# వికలాంగులకు అండగా ఎమ్మెల్యే నాగరాజు

- **వికలాంగుల కాలనీకి రూ.1.5 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన**



**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:** వర్ధన్నపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కొనసాగింపులో భాగంగా ఆదివారం 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి వికలాంగుల కాలనీలో రూ.1.5 కోట్ల సాధారణ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ పనులకు ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - "ఒక్క రోజులోనే రూ.2.5 కోట్ల విలువైన డ్రైనేజీ, రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం అభివృద్ధిపట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని" పేర్కొన్నారు. ప్రారంభించిన ప్రతీ పనిని నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేస్తామంటూ ప్రజలకు భరోసా ఇచ్చారు.
గత 15 నెలలుగా నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికీ మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల అంచనాలకు తగిన నాయకత్వాన్ని అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జన్ను శీభరాణి-అనీల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బుద్దె పెద్దన్న, రైతు రాజు, గాదె రాము, బిజిలి సంపత్, అఖిల్‌తో పాటు వికలాంగుల కాలనీ వాసులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అక్రమ అరెస్టులకు నిరసనగా బిఆర్ఎస్ ధర్నా

- **సమస్యలపై నిలదీస్తే అక్రమ అరెస్టులు అన్యాయం**
- **పానుగంటి సురేష్ కుమార్ బిఆర్ఎస్ జిల్లా నాయకులు**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** అక్రమ అరెస్టులకు నిరసనగా బిఆర్ఎస్ నాయకులు పెద్దమందడి పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు.సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తే అక్రమ అరెస్టులు చెయ్యడం అన్యాయమని బిఆర్ఎస్ జిల్లా నాయకులు పానుగంటి సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం ఉదయం 4గంటలకు జంగమయపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మిద్దెగోళ్ళ కొండన్న యాదవ్ ను,మరియు దొడగుంటపల్లి గ్రామానికి చెందిన పానుగంటి సురేష్ ను ప్రభుత్వ పథకాలు,ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందున అక్రమ అరెస్టు చేయడం జరిగింది. ఇట్టి చర్యకు నిరసనగా పెద్దమందడి మండల పోలీస్ స్టేషన్ ముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున బిఆర్ఎస్ నాయకులు పాల్గొని ధర్నా చేయడంతో భేషరతుగా వారిని విడుదల చేయడం జరిగింది. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు జంగమాయపల్లి ,బలిజపల్లి,పెద్దమందడి గ్రామాల పార్టీ అధ్యక్షులు వీరపాగ సత్యం,సంజీవ రెడ్డి,సేనాపతి,మండల అధికార ప్రతినిధి సింగిరెడ్డి కురుమూర్తి,మండల నాయకులు జరుపటి కొండల్,అల్వాల వెంకట్ రెడ్డి,పురుషోత్తం రెడ్డి,మండలంలోని వివిధ గ్రామాల బిఆర్ఎస్ నాయకులు ,కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** పెద్దమందడి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం రోజు 20002001 విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కన్నీటితో కారుకున్న చిరునవ్వు పెద్దమందడి జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన 20002001 బ్యాచ్ విద్యార్థులు,25 సంవత్సరాల తరువాత ఒక్కచోట చేరి బాల్య స్నేహాన్ని,గురువుల ఆశీర్వాదాన్ని,విద్యార్థి జీవితాన్నే తిరిగి ఆస్వాదించిన అద్వితీయ దృశ్యాన్ని మనం చూసాం.చిన్ననాటి బెంచీలు,బ్లాక్ బోర్డులు బెల్లు,మోగిన క్లాసురూమ్ ఇవన్నీ కేవలం జ్ఞాపకాలకే పరిమితం కాలేదని, ఇవి మనలో జీవితాంతం నిలిచిపోయే భావోద్వేగాలుగా మిగిలిపోతాయని ఈ కార్యక్రమం చాటి చెప్పింది అప్పుడు చినుకుల్లా మన మీద కురిసిన గురువుల మాటలు, ఆశీర్వాదాలుగా మన హృదయాలను తడిపాయి.చదువులో మెరిసిన మొదటి 10 మంది విద్యార్థులతో పాటు, మానవందరంలో టాప్ 10 స్థానాలు పొందిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించడం ద్వారా,ప్రతిభకు నిజమైన గౌరవం చెల్లించారు.25 సంవత్సరాల స్నేహ బంధానికి సిల్వర్ జుబ్లీ అనే పేరుతో మన ఊహలకు వెలకట్టే మధురమైన క్షణాలను అందుకున్నారు. గతాన్ని గుర్తు చేసుకుంటూ చాలా మంది విద్యార్థులు కన్నీటిని తుడుచుకుంటూ ఆనంద క్షణాలను గుండెల్లో వేసుకున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9:00 గంటలకు ప్రారంభమై,సాయంత్రం 6:00 గంటల వరకు ఉత్సాహంగా సాగింది.చివరగా అందరూ ఒకరికొకరు మళ్లీ కలుసుకుంటామనే ఆశతో,హృదయాల నిండా జ్ఞాపకాలను నింపుకుని వెళ్ళారు.ఈ కార్యక్రమాన్ని ఎంతో సమర్ధవంతంగా నిర్వహించిన 20002001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పెద్దమందడి వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**





**మెదక్ జిల్లా బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:** ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. ఆదివారం మెదక్ జిల్లా మనోరాబాద్ మండలం, ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి,ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు విభాగాలను కలియ తిరుగుతూ ఒక్కో విభాగం పనితీరును పరిశీలించి, వైద్యులకు తగిన సూచనలు చేశారు. ఆసుపత్రిలోని హాజరు పట్టికను తెప్పించుకుని పరిశీలించారు. ప్రతి రోజు ఇన్ పేషెంట్లు అవుట్ పేషెంట్లు ఎంత మంది వస్తున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా తదితర వివరాలను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్. అనంతరం రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. నిరంతరం వైద్యసేవలు అందుతున్నాయని రోగులు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది విధులకు సమయానికి రావాలని ఆదేశించారు. రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలని, వివిధ రోగాలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రి లోపల, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. దవాఖానాలో చికిత్స పొందుతున్న రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ, వసతులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

# దేశం జోలికొస్తే నారీమణుల సత్తా చూపిస్తాం

**ఆపరేషన్ సిందూర్ అందుకు నిదర్శనం**





**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** భారతదేశంలో 26మంది మహిళల సిందూరాన్ని తుడిచి పైశాచిక ఆనందాన్ని పొందిన ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్ పేరుతో ఇదే దేశ నారీమణులు, ఆర్మీ అధికారులు కల్నల్ సోఫియా, కమాండ్ వ్యోమికా సింగ్‌ల రూపంలో చుక్కలు చూపించారని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా దేశ వ్యాప్తంగా తిరంగ యాత్రలు జరుగుతున్న సంగతి తెలిసిందే అందులో భాగంగా ఖమ్మం నగరంలో మహిళల ఆధ్వర్యంలో సిందూర్ యాత్రను బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అద్యక్షురాలు శిల్పారెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న మహిళలనుద్దేశించి ఆమె మాట్లాడుతూ పహల్గాంలో పురుషులను తమ భార్యల ముందే అతి కిరాతంగా హతమార్చి వారి సిందూరాన్ని తుడిచిన ఉగ్రవాదులకు భారత ప్రధాని నరేంద్ర మోడీ తగిన గుణపాఠం చెప్పారని, నారీమణుల నేతృత్వంలో ఆపరేషన్ సిందూర్‌ను ఏర్పాటు చేసి ఉగ్రమూకలకు, పాకిస్తాన్‌కు తగిన శాస్తి చేశారని అన్నారు. ఇకపై దేశం జోలికొస్తే చావు తప్పదు అనేలా ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌కు నాయకత్వం వహించిన కల్నల్ సోఫియా, కమాండ్ వ్యోమికా సింగ్‌లతో పాటు ఆపరేషన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ హిందువులా, ముస్లింలా అని నిర్ధారించుకొని మరీ 26మందిని పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ సూచన మేరకు ఆర్మీ అధికారులు తగిన శాస్తి చేశారని ఎద్దేవా చేశారు. ఇకపై దేశం జోలికి, మహిళల సిందూరం జోలికి రావాలంటేనే చుట్టు పక్కదేశాలు గజగజ వణికిపోయే పరిస్థితి ఆపరేషన్ సిందూర్‌తో సాధ్యమైందని ధీమా వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం అహర్నిషలూ ప్రాణాలను ఫలంగా పెట్టి ప్రజలను కాపాడుతున్న జవాన్లకు దేశ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని, జాతీయవాదాన్ని బలంగా వినిపించడమే ఆర్మీకి మనమిచ్చే మద్దతు అన్నారు. దేశ ఆర్మీకి మహిళాలోకంతో పాటు, ప్రతి ఒక్కరూ మద్ధతు తెలపాలని ఈ సందర్భంగా కోరారు. 26వ తేదీన వైరా పట్టణంలో తిరంగ యాత్ర జరుగుతుందని, జాతీయవాదులు అధిక సంఖ్యలో హాజరై జవాన్లకు మద్ధతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ సన్నే ఉదయ్ ప్రతాప్, బండారు నరేష్, నకరికంటి వీరభద్రం, విజయ రెడ్డి, దొడ్డ అరుణ, పమ్మి అనిత, నీరుకొండ ఉశా రాణి, శ్రీరామనేని మణి, మంద సరస్వతి, రజినీ రెడ్డి, సురేఖ, కనగంటి నాగమణి, దార్ల మల్లేశ్వరి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ట్రైన్ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**కాజీపేట తెలంగాణ ముచ్చట్లు**

కాజీపేట జంక్షన్ పరిధిలోని నస్కల్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం ఆదివారము ఉదయం నస్కల్ స్టేషన్ సమీపంలో 30 సంవత్సరాల కలిగిన గుర్తు తెలియని మగ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు వాళ్లు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు గాని మొబైల్ ఫోను కానీ లేవని ఒంటిపై నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ఎరుపు రంగు టీ షర్ట్ పాయింట్ బెల్ట్ కి లవ్ అనే ఇంగ్లీష్ అక్షరాలు కలవని పోలీసులు వివరించారు. మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆసుపత్రి లోని మార్చురి గదిలో భద్రపరిచినట్లు వారు తెలిపారు. గుర్తుతెలియని మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే 871 256 85 32 తెలుపగలరని పోలీసులు కోరారు



## నెతన్యాహు అరాచకం



నియంతల ఏలుబడిలో పౌరహక్కులకు తావు ఉండదు. మంచీ, మానవత్వానికి చోటు దొరకదు. నిరంకుశత్వానికే అక్కడ అగ్రతాంబూలం. కానీ, నేటి ఆధునిక యుగంలో ప్రజాస్వామ్యం ముసుగులో నియంతలను తలదన్నే దేశాలున్నాయంటే నమ్మశక్యం కాదు. అలాంటి దేశాల జాబితాలో అగ్రస్థానం ఇజ్రాయెల్ దేనంటే ఆశ్చర్యపోనక్కరలేదు. పేరుకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వర్థిల్లుతున్న ఈ దేశంలో అధికార పీఠంపై కూర్చున్నది అక్షరాలా ఓ నియంత. ఆ పెద్దమనిషి పేరు బెంజమిన్ నెతన్యాహు. ఆయన నేతృత్వంలో గాజాపై గత 18 నెలలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండలో 52 వేల మందికి పైగా అసువులు బాశారు. లక్షలాది మంది క్షతగాత్రులయ్యారు. అయినా ఆయన యుద్ధకాంక్ష మాత్రం తీరలేదు సరికదా, రానురాను మరింత పెచ్చరిల్లుతోంది. గాజాపై 'పరిపూర్ణ విజయం' సాధించేవరకూ విశ్రమించబోనని ఇటీవల ఆయన చేసిన శపథమే ఇందుకు ఉదాహరణ. 'గాజాను మొత్తం స్వాధీనం చేసుకుంటాం.అక్కడ నెలకొన్న కరవు పరిస్థితులను నివారించవలసి ఉంది' అంటూ ఆయన తాజాగా చేసిన ప్రకటన గిచ్చి జోలపాడటమనే సామెతను గుర్తు చేయక మానదు. గాజాను ఇంతటి దుర్భర స్థితిలోకి నెట్టిన నెతన్యాహు ఇప్పుడు దానిని బాగు చేస్తామనడాన్ని చూసి ముక్కున వేలేసుకోనివారు ఉండరు. గాజాలో ప్రస్తుత పరిస్థితిని వర్ణించడానికి మాటలు చాలవు. ఎక్కడ చూసినా శిథిల భవనాలు, బక్కచిక్కిన మనుషులు. ఆకలి బాధను తట్టుకోలేక కళ్లముందే బిడ్డలు చనిపోతుంటే ఏడవడానికి కూడా ఓపికలేని మాతృమూర్తులను చూస్తే ఎవరికైనా గుండె చెరువు కాక మానదు. గాజాకు తక్షణ మానవతాసాయం అందకపోతే, రానున్న 48 గంటల్లో 14వేల మంది చిన్నారులు క్షుద్బాధతో చనిపోయే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసిందంటే, అక్కడి పరిస్థితి ఎంత భీతావహంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కానీ నెతన్యాహు మనసు మాత్రం కరగడం లేదు. గత కొన్ని నెలలుగా మానవతాసాయంపై ఉక్కుపాదం మోపిన ఆ పెద్దమనిషి, ఐక్యరాజ్య సమితి హెచ్చరికతోనూ దిగిరాకపోగా, పరిమితి సాయానికి మాత్రమే అనుమతినిస్తామనడం కరడుగట్టిన రాక్షసత్వానికి నిదర్శనం. హమాస్ ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా యుద్ధం ప్రారంభించిన నెతన్యాహు ఆ లక్ష్యానికి ఎగనామం పెట్టి, ఆస్పత్రులు, శరణార్థి శిబిరాలపైనా యథేచ్ఛగా బాంబుల వర్షం కురిపిస్తూ అమాయకుల ప్రాణాలు హరిస్తున్నారు. ఇప్పటివరకూ ఇజ్రాయెల్ సైన్యం హతమార్చిన యాభైరెండు వేలమందిలో హమాస్ ఉగ్రవాదులు ఎంతమందో ఆయన చెప్పగలరా? జనవరి నెలలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని తుంగలో తొక్కి మళ్లీ యుద్ధానికి సిద్ధపడిన నెతన్యాహు ప్రధాన లక్ష్యం గాజా ఆక్రమణే. గాజాను స్వాధీనం చేసుకుని, కరవు పరిస్థితులను నివారిస్తామని నెతన్యాహు చెబుతుండగా, అక్కడి ప్రజలను వేరే చోటికి తరలించి, గాజాను అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటున్నారు.మొత్తానికి ఇద్దరికీ ఒకటే లక్ష్యం.. గాజాను హస్తగతం చేసుకోవడం. అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టీ పట్టగానే ఆధునిక శాంతిదూత అవతారమెత్తిన ట్రంప్, రష్యా ఉక్రెయిన్‌బీ హమాస్ ఇజ్రాయెల్ యుద్ధాలపై గుడ్లురిమారు. తక్షణమే యుద్ధవిరమణ జరగకపోతే జాగ్రత్త అంటూ హెచ్చరించారు. కానీ, వాస్తవంలో తాను ఆశించింది జరగకపోగా, ఇజ్రాయెల్‌ను కనీసం చర్చల వేదికపైకి కూడా రప్పించలేకపోతున్నారు. అంతెందుకు, గాజాపై ఇజ్రాయెల్ అమానుష కాండను తాజాగా బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా ముక్తకంఠంతో ఖండిరచగా అమెరికా వాటితో గొంతు కలపకపోవడం దేనికి సంకేతం? ఇజ్రాయెల్‌తో స్వేచ్ఛా వాణిజ్య చర్చలను సైతం నిలిపివేసి, బ్రిటన్ తన నిబద్ధతను చాటుకోవడం ప్రశంసనీయం. హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలే లక్ష్యంగా 2023 అక్టోబర్ 1న యుద్ధం ప్రారంభించిన నెతన్యాహు ఇప్పుడు తన లక్ష్యాన్ని తానే తుంగలో తొక్కి గాజా ఆక్రమణ దిశగా అడుగులు వేయడానికి స్వప్రయోజనాలతోపాటు రాజకీయ ప్రయోజనాలు కూడా కారణం. యుద్ధాన్ని ఎంతకాలం కొనసాగిస్తే అంతకాలం తాను పదవిలో కొనసాగవచ్చునన్నది ఆయన ఆలోచనగా కనబడుతోంది. ఇప్పటికే నెతన్యాహుపై అనేక అవినీతి ఆరోపణలపై వివిధ కోర్టులలో విచారణ జరుగుతోంది. మరోవైపు నిరంతర యుద్ధం పట్ల ఇజ్రాయెల్ లోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఇప్పటికైనా మేలుకోవాలి. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా దేశాల బాటలో ఇజ్రాయెల్‌పై వత్తిడి తెచ్చేందుకు చేయిచేయి కలిపి ముందుకు రావాలి. గాజాకు మానవతా సాయం అందించడమే తక్షణ కర్తవ్యంగా నెతన్యాహు మెడలు వంచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయాలి.

## ప్రభుత్వ బడిని కాపాడుకోలేమా!

ప్రభుత్వ బడిని కాపాడటం, సంస్కరణల కోసం నూతనంగా నియమించిన తెలంగాణా విద్యాకమిషన్ సర్కార్‌కు కొన్ని సూచ నలు చేసింది. బడీడు పిల్లల కోసం ఇప్పుడున్న ప్రభుత్వ బడుల స్థానంలో నర్సరీ నుండి రెండవతరగతి వరకు ''తెలంగాణా ఫౌండేషన్ స్కూల్'' మండలానికి నాలుగు ఏర్పాటు చేయాలని,'' నర్సరీ నుండి ఇంటర్ వరకు ''తెలం గాణా పబ్లిక్ స్కూల్'' మండలానికి కనీసం మూడు చొప్పున ఏర్పరచాలని సిఫార్సు చేసింది, అంతే కాదు, 202526 విద్యా సంవ త్సరం నుంచి 2029 30కి ఈ ప్రణాళిక ముగిసేలా ఆర్థిక అంచనా కూడా ఇచ్చింది. మండలంలో నాలుగు ఫౌండేషన్ స్కూల్‌కు 3.5 కోట్ల చొప్పున 14కోట్లు, మూడు పబ్లిక్ పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు 12కోట్ల చొప్పున 36కోట్లు వెరసి మండలానికి 50కోట్ల రూపాయలు ఖర్చు అంచనా వేసింది. ఈ లెక్కన 202526 ఏడాదికి గానూ వంద మండ లాలు ప్రభుత్వ బడులు తీసుకుంటే ఈఏడాది 5వేల కోట్లు ఖర్చుచేయాలి. బడ్జెట్ కంటేముందే ప్రభుత్వానికి తెలంగాణా విద్యాకమిషన్ నివేదిక ఇచ్చినా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. మరి ప్రభుత్వ పాఠశాల సంస్కరణ ఎలా జరుగుతుంది? ఇంకా పాఠశాల యాక్సెస్ కోసం విద్యాకమిషన్ పలు సూచనలు చేసింది. క్యాచ్‌మెంట్ ఏరియా నుండి పాఠశాల వరకు అవసరమైతే ట్రాన్స్‌పోర్టు సౌకర్యం ఏర్పాటు చేయాలని సిపార్సు చేసింది. ఈ సిపార్సు కొత్తదేమీకాదు! సర్వ శిక్షాఅభియాన్ ఇంతకు ముందు యాక్సెస్‌లెస్ పాఠశాలలకు సిపార్సు చేసిన ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాన్నే తాజాగా కమిటీ సిఫార్సు చేసింది. దశాబ్దంన్నర క్రితమే సర్వ శిక్షా అభియాన్ ఈ సిపార్సు చేసింది. అయినా పాలకులు పట్టించుకోకపోవడం వల్ల ఆ పథకం అమలు కాలేదు? ఇప్పుడు మినీబస్సులు,ఆటోలు నిరుద్యోగులకు ఇచ్చి ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం అనే ఒక మంచి ఆలోచన తెలంగాణా విద్యా కమిషన్ చేసింది.ఇక గ్రామాలు, పట్టణం మురికివాడల్లో ఉన్న ఈ వేలాది ప్రభుత్వ పాఠశాలకువిలువైన భూములు న్నాయి. కొన్ని దశాబ్దాలు గా కోట్లాది రూపాయలు వెచ్చించి సర్వశిక్షా అభియాన్ కట్టిన భవనాలూ ఉన్నాయి. ఇంటర్నెట్‌తో పాటు కంప్యూటర్ సౌక ర్యాలు, లేబొరేటరీ సౌకర్యాలు సైతం ఈ పాఠశాలల్లో అంతంత మాత్రమే. బోధించడానికి నిష్ణాతు లైన, శిక్షణ పొందిన ఉపాధ్యా యులు ఉన్నారు. కానీ! ''అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు'' పాఠశాలలో చదువుకునే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ దిగజారి పోతు న్నది. అందులో నూటికి నూరు శాతం పర్యవేక్షణా లోపమే. ప్రభుత్వ పాఠశాల ఏరియాలో పిల్లలు లేరా? ఉన్నారు.కానీ,వారు ప్రభుత్వ పాఠశాల దాటి బస్సుల్లో ప్రయివేటుకు వెళ్తున్నారు. మరికొందరు హాస్టల్ సౌకర్యం ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలల బాట పడుతున్నారు.

పాలకులు ఎవరు అధికారంలోకి వచ్చినా కొన్ని దశాబ్దాలుగా ఓ చిత్రమైన వైఖరిని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ముప్పై వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించడం కష్టమని, కొద్ది నిధులతో ప్రజల కోసం తామేదో విద్యావ్యవస్థలో కొత్త ప్రయోగం చేస్తున్నట్లు నటిస్తు న్నారు. అరకొర రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రక టించి ప్రభుత్వ పాఠశాలలో నమోదును, విద్యార్థుల సంఖ్యను తగ్గించి దెబ్బ తీస్తున్నారు? ప్రజల్ని మసి భూసి మభ్యపెడుతున్నారు? తక్కువ బడ్జెట్‌తో ఉన్నత ఫలితాలు తీసుకొస్తున్నామని చెప్పుకోవడా నికి పనికొస్తాయి తప్ప ఇలాంటి ప్రయోగాల్లో చిత్త శుద్ధి కనపడదు! వీటితో ప్రజలకు ఎలాంటి ఉప యోగం ఉండదని ఇప్పటికే ఆయా వ్యవస్థలు నిరూపించాయి. అంతిమ సారాంశం ఏమిమంటే సకల సౌకర్యాలున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కోవాల్సిన విద్యార్థులను అటు ప్రయివేటు పాఠశాల వ్యవస్థ, ఇటు గమ్యమేమిటో అర్థం కానీ ప్రత్యేక పాఠశాలల ఏర్పాటు, వెరసి రాష్ట్రంలో ఉన్న ముప్పై వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో సగానికిపైగా మూతపడే దిశగా ప్రయా ణం కొనసాగుతున్నాయి. 202324 ప్రభుత్వ విద్యా గణాంకాల్ని అనుసరించి రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో ప్రాథమిక పాఠశాలలు 19,734, ప్రాథమి కోన్నత 3,237, ఉన్నత 4843, రెసిడెన్షి యల్ 403, వీటికి అదనంగా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు మరో 662 ఉన్నాయి. మొత్తంగా 30,684 ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం మనుగడలో ఉన్నాయి.ఇక ప్రయివేటు రంగంలో గుర్తింపు పొందిన 12,126 పాఠశాలలుండగా ఇందులో అత్యధికంగా ఆరువేల పైచిలుకు ప్రాథ మిక పాఠశాలలతో కూడిన ఉన్నత పాఠశాలలే!? ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల శిక్షణ పొందిన, సబ్జెక్టు నైపుణ్యం కలిగిన 1,48, 456మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా, కేవలం పన్నెండు వేల ప్రయివేటు రంగంలోని పాఠ శాలల్లో సరైన కనీస వేతనంగానీ, సరైన శిక్షణగానీ, చాలా మందిలో కనీసం నైపుణ్యంగానీ లేని 1,89, 438 మంది ప్రయివేటు ఉపాధ్యాయులు ఉన్నారు.

అంతేకాదు, ప్రభుత్వ పాఠశాలలో ప్రతి 19 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉంటే, ప్రయివేటు పాఠశాలలో ఆసంఖ్య 24గా ఉంది. అంటే ఇక్కడ ప్రయివేటు యాజమాన్యాలు లాభాలే ధ్యేయంగా పని చేయడంతో పాటు ఉపాధ్యాయులకు తక్కువ వేతనాలిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నట్లు ప్రభు త్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి.ఇక ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అనాలోచిత అసమతూల్యత ఉంటున్నది. విద్యార్థులు అత్యధికంగా ఉన్న వందల రెసిడెన్షియల్ పాఠశాలల్లో అరకొర వేతనాలతో పని చేసే ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఎక్కువ సంఖ్య లో విద్యార్థులు ఉండగా, రాష్ట్రంలోని ఐదు వేల పైచిలుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అన్ని రకాల అర్హత, నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులు న్నప్పటికీ సరైన సంఖ్యలో విద్యార్థుల నమోదు లేదు? ఈ అగాదానికి మూలం ముందు చూపు లేని, తాత్కా లిక ప్రచారం పటాటోప చర్యలే. దశా బ్దాలుగా ప్రభుత్వ పాఠశాల వ్యవస్థపై కొనసాగు తున్న వివక్షతోపాటు, పరోక్షంగా ప్రయివేటు విద్యా వ్యవస్థను ప్రోత్సహించి విద్యా,ఉద్యోగ బాధ్యతల నుండి వైదొలిగే చర్యల్లో పాలకులు నిమగమ వ్వడమే. ప్రభుత్వ విద్యారంగంలో ఉన్న పాఠశాల లు స్థితిగతులు గాలి కొదిలి కొత్తదనం, ఎక్సలెన్సీ పేరుతో ప్రభుత్వ పాఠశాలకు సమాంతరంగా వివిధ రకాల రెసిడెన్షియల్ పాఠశాల వ్యవస్థను ఏర్పరచడం ప్రభుత్వ పాఠశాలలకు మరో శాపంగా మారింది. కొత్తగా ఏర్పాటు చేసిన గురుకులాలు తప్పని కాదు, కానీ అదే స్థాయిలో ప్రభుత్వ పాఠశా లలను కూడా బలోపేతానికి చర్యలు తీసుకోక పోవడం ప్రధాన లోపం. ప్రభుత్వ విద్యారంగం అస్తవ్యస్తం మూలంగానే సమా జంలో కుల,మత, ప్రాంతీయ వైషమ్య బీజాలతో పాటు శరీరక శ్రమపట్ల సరైన గౌరవం, క్రమశిక్షణ లోపించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతపాటు సామాజిక అవగాహన, వ్యక్తిత్వ వికాసం, సవాళ్లను ఎదుర్కొనే శక్తి విద్యార్థుల్లో సహజ సిద్ధంగా అలవడుతుందన్న విషయం పాలకులు గుర్తించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడ లోపాలు జరుగుతున్నాయో గుర్తించి వాటిని సరిదిద్ది విద్యార్థుల నమోదుకు అవసరమైన చర్యలు తీసుకోవడం, నాణ్యమైన భోజన వసతులు ఏర్పాటు చేయడం, మరికొన్ని పాఠశా లలకు ఉచిత రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయడం లాంటి విద్యాకమిషన్ సూచనలు పరిగణనలోకి తీసుకోవాల్సినవే. ఇప్పటికే బడిబాట కార్యక్రమం, జూన్ 12నుంచి పాఠశాలలు ప్రార ంభం కానున్న నేపథ్యంలో కమిటీ సిఫార్సులపై విద్యాశాఖ సమగ్ర కసరత్తు చేయాల్సి ఉంది. ఈ విషయంలో ప్రభు త్వం విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు ఆలోచనలు, సలహాలు తీసుకోవడం కూడా అవసరం. తెలంగాణా విద్యా కమిషన్ నివేదిక బుట్టదాఖలు కాకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థుల నమోదు పెంచే దిశగా అడుగులు వేయాలి. అలాగే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం ఇరవై శాతం నిధులు కేటాయించాలి. అందరికీ సమానమైనది ప్రభుత్వ విద్య మాత్రమే. అదే ఆయా కుటుంబాల దశదిశ మారుస్తుంది. తద్వారా దేశంలో పరిపూర్ణ మానవ వనరుల అభివృద్ధికి ఉపయోగపడుతుంది. దేశ ప్రతిష్టను పెంచేందుకు సహకరిస్తుంది.



## దేశద్రోహుల భరతం పట్టాలి



జ్యోతి మల్హోత్రా పేరు ఇప్పుడు భారతదేశం అంతటా ప్రతిధ్వనిస్తుంది. ఆకర్షణీయ రూపురేఖలతో, చక్కటి ఉచ్చారణతో, మంచి వాగ్ధాటితో ఎంతటివారినైనా ఇట్టే ఆకర్షించే శక్తిసామర్థ్యాలు గల జ్యోతి మల్హోతా, పర్యాటక ప్రాంతాలకు దూసుకెవెళ్లి, వార్తా విశేషాలను కవర్ చేస్తూ వాటిని వీడియోల ద్వారా సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తూ వీక్షకుల మన్ననలు పొందిన ట్రావెల్ యూట్యూబర్‌గా పేరు పొందింది. ఆమె ఇప్పుడు అనేక ఆరోపణలతో చిక్కుల్లోపడిరది. ఆమె పాకిస్తానీ నెంబరు 1 గూఢచారిణి అని కొందరు అంటున్నారు. ఈ విషయం తెలిసిందే తడవుగా అందరూ దిగ్భ్రాంతికి గురయ్యారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్ సైనిక ఇంటలిజెన్స్ వర్గాల పరిశోధనా సంస్థలు అనేక విషయాలతోపాటు యూట్యూబర్ల కార్యకలాపాలపై కూడా విచారణ చేశాయి. ఈ సందర్భంగా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా దేశద్రోహ కుట్రల ఆనువాళ్ళ చరిత్ర బయటపడినట్లు తెలుస్తోంది. మనదేశంలో బతుకుతూ తన ట్రావెలర్ యూట్యూబర్ వృత్తిలో భాగంగా అనేక ఆకర్షణీయమైన, కీలకమైన ప్రదేశాలను పర్యటిస్తూ, ముఖ్యమైన కట్టడాల వీడియోలు తీసి పాకిస్తాన్ రాయబార కార్యాలయంలో ముఖ్య అధికారులతో సంబంధాలు పెట్టుకొని, వారితో సంప్రదింపులు జరిపి మన దేశానికి చెందిన కీలక సమాచారం అందించిందని అందులోనూ సైనిక స్థావరాల సమాచారం కూడా ఉందట. ఇందుకు ప్రతిఫలంగా భారీ మొత్తంలో లంచం అందుకుంటూ వస్తుందట. ఇప్పుడు ఈ యూట్యూబర్‌ను భద్రతా బలగాలు తగిన ఆధారాలతో అరెస్టు చేసింది. ఆమెపై ఇంటరాగేషన్ ఇంకా జరుగుతున్నది.ఇంకా సంపూర్ణ సమాచారం వెల్లడి కావాల్సి ఉంది. ఆమెకు ట్రావెల్ విత్ జో అనే పేరుగల యూట్యూబ్ ఛానల్ ఉంది. ఆమె మొదట్లో హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో సంచరించింది. తాను హర్యానా, పంజాబీని అని పరిచయం చేసుకుంది. 33 ఏండ్ల ఈ యూట్యూబర్‌కు ఇప్పటికే 3 లక్షల 85 వేలకు పైగా ఖాతాదార్లు ఉన్నారు. ఆమె పర్యాటక వీడియోలకు ప్రజాదరణ దక్కింది. ఫలితంగా ఆమెలో తక్కువ సమయంలో అధిక ధనం, ఆస్తులు సంపాదించుకోవాలి అనే కోరిక పెరిగింది. దీనితో ఆమె తన వృత్తి ధర్మాన్ని వదిలిపెట్టి దేశంలో కీలక ప్రదేశాలు, కట్టడాలను వీడియోలు తీసి మన శత్రుదేశం పాకిస్తాన్ ఏజెంట్లుకు చేర వేసిందట. ఈ క్రమంలో పలు దేశాలను స్పెషల్ క్లాస్ విమానాల్లో పర్యటించింది. అమెరికా, చైనా, పాకిస్థాన్ వంటి పలు దేశాల్లోని విలాసవంతమైన హోటళ్లలో ఉంటూ అక్కడ ఉన్న సీక్రెట్ స్థలాలు పర్యటించింది. ఆమె అందం, చురుకుదనం అన్నింటిని చూసి పాక్ సమాచార అధికారులు ఆమెను తమ ఏజెంటుగా వాడుకున్నారని పోలీసులు తెలిపారు. ఆమె తెగువతనం చివరికి ఆమెను ఏజెంటుగా చేసిందని కేసు దర్యాప్తులో ఉన్న ఎస్‌పి శశాంక్ కుమార్ సావన్ తెలిపారు. ఆమెకు ఉన్నత స్థాయిలో కనెక్షన్లు లేవని, రహస్య సమాచారం తెలిపే సరైన వనరులుకాని, వ్యక్తుల పరిచయాలు కాని లేనని పాక్ రహస్య గూఢవార సంస్థల అధికారులకు కూడా తెలుసు. అయితే ఆమెకున్న చొరవతో ఈ దిశలో ఆమెను తమ కీలక పాత్రధారిగా చేసుకోవచ్చునని నిర్ధారించుకుని ఆమెను రంగంలోకి దింపినట్లు తెలిసింది. పాకిస్తానీ అధికారులను ఏ విధంగా కలిశారనేది కీలక విషయం అయింది.

ఆ దిశగా పరిశోధన సాగుతోంది. ఆపరేషన్ సిందూర్ తరువాత న్యూఢల్లీలోని పాక్ హైకమిషనర్ కార్యాలయంలో ఆమె పాక్ అధికారి డానిష్ను కలిసింది. అంతకు ముందు ఆమె పలు సార్లు పాకిస్తాన్‌కు వెళ్లిరావడం, చివరికి పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా ఆమె అక్కడ ఓ అతిథి గృహంలో మకాం వేసి ఉండటం వంటి విషయాలను ఇప్పుడు మన ఇంటలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఆమెకు చెందిన పలు ఫోన్లు, యూట్యాబ్లు, ల్యాప్ ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్‌లలో మారు పేర్లతో పాకిస్తాన్ రాయబార కార్యాలయం సిబ్బంది పేర్లు ఉన్నాయట. గత ఏడాది మార్చిలో ఆమె పాకిస్తాన్‌కు వెళ్లి వచ్చింది. పైగా పర్యాటకం ముసుగులో ఓ వీడియో వెలువరించింది. అప్పట్లో ఆమె పాకిస్తాన్ పర్యటనలో భాగంగా తీసిన వీడియోలో ఆమె పాకిస్తాన్‌ను అదే పనిగా కొనియాడిరదని భద్రతా అధికారులు గుర్తించారు. పాకిస్తాన్‌లో పర్యటించినప్పుడు. ఆమె 2023లో పది రోజుల పాటు పార్టీలు, విందులు, వినోదాలతో విలాసవంతంగా గడిపిందిట. అక్కడ ఆమె బస పర్యటనల బాధ్యతను అక్కడి కీలక వ్యక్తి అలీ ఆహవాన్ చూశారని వెల్లడైంది. దేశంలోని పలు ప్రాంతాలు ఢల్లీ, కోల్‌కతా, హైదరాబాద్‌లో కూడా ఆమె యూట్యూబర్‌గా పర్యటించినట్లు కొందరు ప్రముఖులతో పరిచయాలు పెంచుకున్నట్లు వెల్లడైంది. దేశంలో ఇప్పటికీ దాదాపు డజన్ కు పైగా రహస్య ఏజెంట్లు వివిధ ప్రాంతాలలో పట్టుబడ్డారు. పాకిస్తాన్ కు కీలక సైనిక రహస్య సమాచారం చేరవేతల అభియోగాలతో ఇంటలిజెన్స్ వర్గాల నిఘాలో పట్టుబడ్డ వారిలో ట్రావెటర్ యూట్యూబర్ జ్యోతి, ఇతరులు అనేకులు ఇప్పటివరకూ అరెస్టు అయ్యారు. వారిపై ఇంటరాగేషన్ జరుగుతుంది. పాకిస్థాన్ ఇరుగు పొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ ప్రాంతాలకు చెందిన వారే ఈ పట్టుబడ్డవారిలో ఉన్నారని అధికారిక ప్రకటనలతో వెల్లడైంది. పహల్గాం ఉగ్రదాడి, తరువాత ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఇంటలిజెన్స్ వర్గాల నిఘాలో ఈ పాకిస్తాన్ ఏజెంట్లను అరెస్టు చేశారు. పంజాబ్ నుంచి ఆరుగురు, హర్యానా నుంచి ఐదుగురు, యుపి నుంచి ఒక్కరు ఇప్పటి వరకు పట్టుబడ్డారు. అన్వేషణ కొనసాగుతున్నది. అనేక రహస్య సమాచారం వెల్లడి కావల్సి ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ప్రతిరోజూ ఎండుద్రాక్ష తింటున్నారా..?

ద్రాక్షలో రెండు రకాలు ఉంటాయి. ఎండబెట్టిన ద్రాక్ష, పచ్చి ద్రాక్ష.. ఈ రెండు ఆరోగ్యానికి చాలా మంచివని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కానీ ఎండుద్రాక్షలో పోషకాలు కాస్త ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే వీటిని ప్రస్తుతం చాలా మంది రాత్రిపూట నీళ్లలో నానబెట్టి ఉదయమే పరగడుపున తీసుకుంటూ ఉన్నారు. దీని వల్ల చర్మానికి, జుట్టుకు చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఎండుద్రాక్షలో పొటాషియం, భాస్వరం, కాల్షియం, ఫైబర్ అధికంగా ఉంటుంది. విటమిన్ ఎ, బీటా కెరోటిన్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. విటమిన్ బి కాంప్లెక్స్ రక్త పరిమాణాన్ని పెంచుతుంది, ఎండు ద్రాక్షలో ఉండే ఫైబర్ కడుపులో గ్యాస్, ఆమ్లత్వం తగ్గిస్తుంది. ఎండుద్రాక్షలోని పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. దీనిలోని విటమిన్ ఎ కంటి చూపును మెరుగుపరుస్తుంది. శారీరకంగా బలహీనంగా ఉన్నవారు ఎండుద్రాక్ష తినాలి. ఎండుద్రాక్ష పోషక విలువల పరంగా చాలా గొప్పది. ఎండుద్రాక్షలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని రోజూ నానబెట్టి తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎండుద్రాక్షను నీటిలో నానబెట్టి తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు మరింతగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. రక్తహీనతను నివారించడం ఎండుద్రాక్షలో పెద్ద మొత్తంలో ఐరన్ లభిస్తుంది. దీని వినియోగం హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. శరీరంలో రక్త లోపం ఉండదు. రక్తహీనతతో బాధపడేవారు రోజూ ఉదయాన్నే ఎండుద్రాక్షను తీసుకోవాలి. అంతేకాదు..ఎండుద్రాక్ష గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఎండుద్రాక్షలో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. ఇది రక్తపోటును మెయింటెన్ చేయడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. తద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

# నెలరోజుల పాటు ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ ఆకులు తింటే..!

పుదీనా ఆకులలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో నాలుగైదు పుదీనా ఆకులు నమిలితే లెక్కలేన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. పుదీనా ఆకులలో యాంటీఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాటిలో విటమిన్ ఎ, విటమిన్ సి మరియు బికాంప్లెక్స్, భాస్వరం, కాల్షియం, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. పుదీనా ఇనుము, పొటాషియం, మాంగనీస్ గొప్ప వనరులలో ఒకటి. వీటన్నింటితో పాటు ఈ ఆకులలో తక్కువ కేలరీలు, తక్కువ మొత్తంలో ప్రోటీన్, కొవ్వు ఉంటాయి. పుదీనా జీర్ణ సంబంధిత సమస్యలకు దివ్యౌషధంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అజీర్ణం, కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పుదీనా ఆకులతో చేసే వైద్యం ఉపశమనం కలిగిస్తుంది. పుదీనాలో ఉండే మెంథాల్ అనే సమ్మేళనం కడుపులోని కండరాలను సడలించి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అలాగే, భోజనం తర్వాత ఒక కప్పు పుదీనా టీ తాగితే ఆహారం తేలికగా జీర్ణమవుతుంది. కడుపులో అసౌకర్యం తగ్గుతుంది. వికారం, వాంతులు వంటి సమస్యలను కూడా పుదీనా తగ్గిస్తుంది. బస్సు, కార్లు వంటి ప్రయాణాల్లో వికారంగా అనిపించేవారు పుదీనా ఆకులను నమలడం లేదా పుదీనా టీ తాగడం మంచిది. జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి శ్వాసకోశ సమస్యలకు పుదీనా ఒక సహజ ఔషధంలా పనిచేస్తుంది. పుదీనాలో ఉండే మెంథాల్ ముక్కు దిబ్బడను తగ్గిస్తుంది, శ్వాసనాళాలను తెరిచి, శ్వాస తీసుకోవడాన్ని సులభతరం చేస్తుంది. ఆస్తమాతో బాధపడేవారికి కూడా పుదీనా ఉపశమనం కలిగిస్తుంది. పుదీనా ఆకుల ఆవిరి పీల్చడం లేదా పుదీనా నూనెను ఛాతీకి, వీపుకు రాయడం వల్ల శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. పుదీనా సువాసన మనస్సుకు ప్రశాంతతను కలిగిస్తుంది. పుదీనా వాసన పీల్చడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి, మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఒత్తిడితో కూడిన రోజు తర్వాత పుదీనా టీ తాగితే లేదా పుదీనా నూనెతో మర్దన చేసుకుంటే మీరు రిలాక్స్ అవుతారు. పుదీనా నూనెను అరోమాథెరపీలో ఉపయోగిస్తారు. పుదీనా జీవక్రియను పెంచడంలో సహాయపడుతుంది. ఇది కొవ్వును కరిగించడంలో, బరువు తగ్గడంలో ఉపయోగపడుతుంది. బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న వారు తమ రోజు ఆహారంలో పుదీనాను తప్పక చేర్చుకోవాలని చెబుతున్నారు. నోటి దుర్వాసనతో బాధపడే వారు పుదీనా ఆకులు తింటే మంచి ఫలితం ఉంటుంది. అంతేకాదు. పుదీనా ఆకులు తినడం వల్ల నోటి పూత వచ్చే అవకాశాలు తగ్గుతాయి. చర్మ కణాలు ఆరోగ్యంగా ఉంటాయి.. ప్రకాశవంతంగా మారుతుంది. పుదీనాలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు చర్మపు చికాకును తగ్గిస్తాయి. మొటిమలు, మంట, దురద వంటి చర్మ సమస్యలకు పుదీనా ఉపశమనం కలిగిస్తుంది. పుదీనాను ఫేస్ ప్యాక్‌లలో, టోనర్‌లలో ఉపయోగిస్తారు.



# నిద్ర మంచిగా పట్టాలంటే..

## రాత్రిపూట ఇవి రెండు తిని పడుకోండి..!



రాత్రిపూట భోజనం తర్వాత యాలకులు తినడం ఆరోగ్యానికి చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు గ్యాస్, ఉబ్బరం, గుండెల్లో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. నోటికి రుచి కోసం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతత, మంచి నిద్ర కోసం కూడా ఇది ఉపయోగపడుతుంది. రాత్రి భోజనం తర్వాత యాలకులు తినడం ఒక మంచి అలవాటు. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తుంది. ఇది కేవలం రుచికే కాదు.. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. యాలకులు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. భోజనం తిన్న తర్వాత గ్యాస్, ఉబ్బరం లేదా గుండెల్లో మంట వస్తే యాలకులు వాటిని తగ్గించడంలో సహాయపడతాయి. యాలకులు రాత్రిపూట తిన్నప్పుడు మన శరీరానికి హాయిగా ఉంటుంది. ఇది మానసిక ప్రశాంతతనిచ్చేలా సహాయపడుతుంది. జీర్ణక్రియ సజావుగా జరిగితే శరీరానికి అలసట తగ్గుతుంది. దీని వల్ల మంచి నిద్ర కూడా వస్తుంది. తాజా యాలకుల గింజలు నమిలితే శ్వాస సులభంగా మారుతుంది. దీనిలో ఉండే సహజ యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటిలో ఉన్న దుర్వాసన కలిగించే క్రిములను తగ్గించడంలో సహాయపడతాయి. అందుకే చాలా మంది భోజనం తర్వాత యాలకులు తినటం ఇష్టపడతారు. యాలకులు శ్వాస సంబంధిత సమస్యలకు కూడా మేలు చేస్తాయి. దీనిని నమిలినప్పుడు శ్లేష్మం బయటకు రావడానికి అవకాశం కలుగుతుంది. దీంతో దగ్గు, జలుబు వంటి సమస్యలు తక్కువ అవుతాయి. శ్వాస సౌకర్యంగా ఉండేలా చేస్తుంది. యాలకులు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఇది శరీరానికి అవసరమైన సమతౌల్యాన్ని ఇచ్చేలా పనిచేస్తుంది. దీని వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగవుతుంది. దీంతో శరీరంలోని విషాలు సులభంగా బయటపడతాయి. యాలకుల వాసన చాలా మందిని రిలాక్స్ చేస్తుంది. అరోమాథెరపీలో ఇది విరామాన్ని కలిగించేందుకు ఉపయోగపడుతుంది. దీనివల్ల మానసిక శాంతి లభిస్తుంది. రోజంతా పని చేసిన తర్వాత మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ఇది సహాయపడుతుంది. ప్రతి రోజు రాత్రి భోజనం తర్వాత రెండు యాలకుల గింజలు నమిలితే చాలు. ఇది శరీరానికి తేలికగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పెద్దలు, పిల్లలు అందరూ ఈ అలవాటును చేసుకోవచ్చు. ఇలా రోజూ రాత్రిపూట యాలకులు తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.



# ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ పండు తింటే..!

కొన్ని సాధారణ అలవాట్లు మన ఆరోగ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తాయి. వాటిలో ముఖ్యమైనది ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయిని తీసుకోవడం. రాత్రంతా శరీరం జీవక్రియల ద్వారా ఏర్పడిన మలినాలను తొలగించడానికి సిద్ధంగా ఉంటుంది. ఈ సమయంలో బొప్పాయి తినడం ఒక అద్భుతమైన అలవాటు. బొప్పాయిలో అధికంగా ఉండే నీటి శాతం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. అంతేకాకుండా ఇందులో ఉండే పపైన్ అనే ప్రత్యేకమైన ఎంజైమ్ జీర్ణక్రియను ఉత్తేజపరుస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయిని తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ సాఫీగా పనిచేస్తుంది. పపైన్ ఎంజైమ్ ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. తద్వారా ప్రేగు కదలికలు మెరుగుపడి వ్యర్థాలు తేలికగా బయటకు వెళ్ళిపోతాయి. ఇది శరీరం సహజమైన శుద్ధి ప్రక్రియకు తోడ్పడుతుంది. రోజంతా శక్తివంతంగా ఉండటానికి సహాయపడుతుంది. భోజనం చేసిన తర్వాత కడుపు ఉబ్బరంగా అనిపించడం లేదా బరువుగా ఉండటం వంటి సమస్యలతో మీరు ఇబ్బంది పడుతుంటే, బొప్పాయిని తీసుకోవడం వల్ల మంచి ఉపశమనం లభిస్తుంది. బొప్పాయిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్ మనం తీసుకున్న ఆహారంలోని ప్రోటీన్‌లను సులభంగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. దీని ఫలితంగా ఆహారం తేలికగా జీర్ణమవుతుంది. కడుపులో అసౌకర్యం తగ్గుతుంది. అంతేకాకుండా రోజును బొప్పాయితో ప్రారంభించడం వల్ల మలబద్ధకం, అసిడిటీ వంటి సమస్యలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో బొప్పాయిని తీసుకోవడం జీర్ణవ్యవస్థను శుభ్రపరచడానికి, ఆరోగ్యంగా ఉంచడానికి తోడ్పడుతుంది. బొప్పాయి చర్మానికి కావలసిన అనేక పోషకాలను కలిగి ఉంది. విటమిన్ సి, బీటా కెరోటిన్, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు బొప్పాయిలో పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీర్ఘకాలంలో చర్మం మెరిసేలా తయారవుతుంది. బొప్పాయిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఒక్కసారి తినడం వల్ల రోజుకు అవసరమైన విటమిన్ సి మోతాదుకు మించిన శాతం లభిస్తుంది. ఇది శరీరాన్ని వ్యాధుల నుంచి కాపాడుతుంది. అనారోగ్యాలు ఎక్కువగా ఉన్నా కూడా మీరు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుంది. బొప్పాయి అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. ఫోలేట్, పొటాషియం, ఫైబర్ వంటి ముఖ్యమైన పోషకాలు ఇందులో ఉండటం వల్ల రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా బొప్పాయిలో ఉండే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని మంటను తగ్గించడమే కాకుండా కాలేయానికి కూడా శక్తినిస్తాయి. ఒకవేళ మీకు తరచుగా అలసటగా అనిపిస్తే బొప్పాయిని తీసుకోవడం ఒక సహజమైన, ప్రభావవంతమైన పరిష్కారంగా పనిచేస్తుంది. తక్షణ శక్తిని అందించి మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచుతుంది. బొప్పాయి తీపిగా ఉన్నా గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉంటుంది. అంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిని పెంచదు. దీని వల్ల ఎక్కువసేపు తిన్నట్లే అనిపిస్తుంది. మధ్యాహ్నం ఆకలి ఎక్కువగా ఉన్నప్పుడు బొప్పాయిని తినడం వల్ల తక్షణమే ఆకలి తగ్గి తినాలనే కోరిక తగ్గుతుంది. ప్రతి పండును ఖాళీ కడుపుతో తినడం మంచిది కాదు. బొప్పాయి మృదువుగా ఉండడం వల్ల ఇది సులభంగా జీర్ణమవుతుంది.

# ఈ పండును తినడం అస్సలు మిస్సవ్వకండి..



పియర్స్ పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా కలిగి ఉంటుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది, రోగనిరోధక శక్తి పెరుగుతుంది, గుండె ఆరోగ్యంగా ఉంటుంది. వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచేందుకు ఇది అద్భుతంగా పనిచేస్తుంది. బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఎంపిక. పియర్స్ పండు ఇది పోషకాలు అధికంగా కలిగిన పండు. శరీరానికి అవసరమైన అనేక విటమిన్లు, ఖనిజాలు పియర్స్‌లో సులభంగా లభిస్తాయి. ఫైబర్, విటమిన్ సి, విటమిన్ కె, పొటాషియం, కాపర్ వంటి ముఖ్యమైన పోషకాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. పియర్స్‌ను తరచూ ఆహారంలో చేర్చడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. ఈ పండులో ఉండే విటమిన్ సి శరీర కణాలకు రక్షణను అందిస్తుంది. వాతావరణ మార్పులు వల్ల వచ్చే జలుబు, జ్వరం వంటి సమస్యలను ఎదుర్కొనగల శక్తి పెరుగుతుంది. వైరల్ అటాక్‌లను నిరోధించడంలో సహాయపడుతుంది. పియర్స్‌లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ ఫైబర్ జీర్ణక్రియను నియంత్రణలో ఉంచుతుంది. పేగుల లోపల పదార్థాలు సాఫీగా కదిలేందుకు తోడ్పడుతుంది. మలబద్ధకం, పొట్టలో ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గుతాయి. ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థకు బలం చేకూరుతుంది. ఈ పండులో ఫ్లేవనాయిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల శరీరంలోని మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. దీర్ఘకాలిక ఇన్ఫ్లమేషన్ ఉన్నవారికి ఇది సహజ చికిత్సగా పని చేస్తుంది. గుండెకు సంబంధించిన రుగ్మతలు, అధిక రక్తపోటు వంటి సమస్యలకు పియర్స్ మంచి నివారణ. రోజూ తినే అలవాటు వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. వేసవిలో శరీరానికి తేమ తగ్గిపోవడం సహజం. ఇలాంటి సమయంలో పియర్స్ లాంటి నీటి శాతం అధికంగా ఉన్న పండ్లు ఉపశమనంగా మారతాయి. ఇది శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. చర్మానికి నలుపు తగ్గి ప్రకాశవంతంగా మారుతుంది. నీటి లోపం వల్ల వచ్చే అలసట, మానసిక అలజడి కూడా తగ్గుతుంది. పియర్స్‌లోని ఫైబర్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. పేగులలో ఉన్న బైల్ యాసిడ్స్‌ను శోషించి వాటిని మలంతో కలిసి శరీరంలో నుంచి బయటకు పంపిస్తుంది. ఫలితంగా కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె సంబంధిత సమస్యలకు ఈ పండు సహజంగా రక్షణగా మారుతుంది.

# జబ్బులన్నీ పారిపోవాలంటే.. ఈ టీ తాగాల్సిందే..!



లవంగంతో చేసిన టీ ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు శరీరాన్ని లోపల నుంచి బలంగా మారుస్తుంది. జలుబు, దగ్గు వంటి సమస్యల నుండి ఉపశమనం ఇస్తుంది. నోటి దుర్వాసన, శ్వాస సమస్యలు తగ్గుతాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. లవంగం అనేది ప్రతి ఇంట్లో నిత్యం కనిపించే ఒక సాధారణ మసాలా ద్రవ్యమే అయినా.. దీని వల్ల కలిగే ఆరోగ్య లాభాలు విశేషమైనవే. చిన్నదైన ఈ లవంగం శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తూ లోపల నుంచి శక్తివంతంగా మార్చే శక్తి కలిగి ఉంటుంది. లవంగంలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే హానికరమైన ఫ్రీ రాడికల్‌స్‌ను తుడిచిపెట్టే శక్తిని కలిగి ఉంటాయి. ఫలితంగా కణజాలం మెరుగవుతుంది, శరీరం బలపడుతుంది. నిత్యం జబ్బులు రాకుండా ఉండేందుకు సహాయపడుతుంది. జీర్ణ సమస్యలు తరచూ వస్తే ఉదయాన్నే ఖాళీ కడుపుతో లేదా భోజనానంతరం లవంగంతో తయారు చేసిన టీ త్రాగడం మంచిది. ఈ టీ జీర్ణ ప్రక్రియను చక్కబెట్టే పనిలో కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణఎంజైముల ఉత్పత్తిని పెంచడంతో పాటు ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. కడుపులో అసౌకర్యం, నొప్పులు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. భోజనం తర్వాత తిమ్మిరి, గ్యాస్ వంటి ఇబ్బందులు కలిగే వారికి లవంగం టీ బాగా ఉపయోగపడుతుంది. ఇది సహజంగా జీర్ణాశయాన్ని శుభ్రపరచడంతో పాటు శరీరానికి తేలికపరచే పని చేస్తుంది. అందువల్ల అలసట తగ్గిపోతుంది, శక్తి పెరుగుతుంది. శీతాకాలంలో, వాతావరణ మార్పుల సమయంలో జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అప్పుడు రోగనిరోధక శక్తిని పెంచాల్సిన అవసరం ఉంటుంది. లవంగంలో ఉండే యాంటీ బాక్టీరియల్ లక్షణాలు శరీరాన్ని రక్షించే పనిలో కీలకంగా పనిచేస్తాయి. వైరస్‌లను అడ్డుకుంటాయి, ఇన్ఫెక్షన్ల ప్రభావాన్ని తగ్గిస్తాయి. గొంతులో నొప్పి ఉన్నప్పుడు లేదా శ్లేష్మం వల్ల శ్వాస సరిగా జరగకపోతే వేడి వేడి లవంగం టీ త్రాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది. ఇది శ్వాస మార్గాలను స్వేచ్ఛగా మారుస్తుంది. గొంతు నొప్పి తగ్గిపోతుంది, శ్వాస సులభతరం అవుతుంది. నోటి ఆరోగ్యానికి కూడా ఇది బాగా ఉపయోగపడుతుంది. నోటి దుర్వాసన, చిగుళ్ల సమస్యలు లాంటివి చాలా మందికి తరచూ కలుగుతూ ఉంటాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సోమవారం - 26 - మే - 2025


# రుహాని శర్మ జర్నీ
## వెండితెరపై మెరిసే తార నుండి వర్షపు సెల్ఫీల్లే వరకు!

మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన రుహాని శర్మ తమిళ చిత్రం కడైసి బెంచ్ కార్తీ అనే సినిమాతో సినీ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. తర్వాత చి లా సౌ అనే మూవీలో అవకాశం దక్కించుకుంది. వీటితో పాటు HIT: ది ఫస్ట్ కేస్, నూటొక్క జిల్లాల అందగాడు వంటి చిత్రాలలో నటించింది . 2019 లో ఆమె కమలతో మలయాళంలోకి అడుగుపెట్టింది. రుహాని పంజాబీ మ్యూజిక్ వీడియోలలో కూడా కనిపించింది. అలాగే ఆమె - అధ్యాయం 1, ఆగ్రా, సైంధవ్, ఆపరేషన్ వాలెంటైన్, శ్రీరంగ నీతులు, నన్ను ప్రేమించు, బ్లాక్అవుట్ వంటి చిత్రాల్లో కూడా నటించి మెప్పించింది. అలాగే కర్వా చౌత్, కుడి తు పటాకా, పాటియేల్ వాల్ ను, కాలేజ్ వాలి యారి, జజ్బాత్ – ది ఫీలింగ్, ఉచియన్ ఉడారియన్, బిగ్ ఫ్యాన్, డెంగ్యూ vs పెందు, హిప్నోటైజ్, తు మిల్తా హై ముఝే వంటి మ్యూజిక్ వీడియోల్లో మెరిసింది. తాజాగా ఈ నటి ఓ పోస్ట్ పంచుకుని ఈ విధంగా క్యాప్షన్ రాసుకొచ్చింది. “ఫోటో డంప్ లోడింగ్... “ఇండియా నుండి హ్యారీ పాటర్ కి దుర్ కి కజిన్ కనిపించాడు. ఈ సెల్ఫీ యాంగిల్ మాత్రమే పనిచేస్తుంది. వర్షపు చుక్కలు + ఫిల్మీ పోజ్ = డెడ్లీ కాంబో.. పూర్తి నిజాయితీ, నన్ను నమ్మండి. నేను పోజు ఇవ్వడం లేదని ప్రమాణం చేస్తున్నాను.. నాని ఇంటికి వెళ్ళే దారిలో అందమైన చాయ్ స్టాల్ కనిపించింది. కానీ నేను చాయ్ తాగలేదు సరే... ఇక్కడ కాఫీ విధేయుడిని నిర్ధారించవద్దు.. ఈ వీడియోకి క్యాప్షన్లు లేవు నిజాయితీగా ఉన్నట్లు నటిస్తున్నాను... అది నిజంగానే కనిపిస్తుందని ఆశిస్తున్నాను.. ఉదయం బాల్కనీ వ్యూ.. సూర్యాస్తమయాల రంగులు నన్ను ఎల్లప్పుడూ ఉత్తేజపరుస్తాయి”. అంటూ పలు మాటలు రాసుకొచ్చింది.



# భారత సైనికుల కోసం ప్రీతి జింటా భారీ విరాళం
## 1.10 కోట్లతో ఆర్మీ వెల్ఫేర్‌కు మద్దతు



బాలీవుడ్ హీరోయిన్ ప్రీతి జింటాగురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పని లేదు. పలు చిత్రాల్లో నటించి ఫుల్ ఫేమ్ తెచ్చుకుంది. అలాగే ఆమె తెలుగు స్టార్స్ మహేష్ బాబు. వెంకటేష్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించి మెప్పించింది. గత కొద్ది కాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. అంతేకాకుండా ఐపీఎల్‌లోనూ హుషారుగా పాల్గొంటుంది. పంజాబ్ కింగ్స్ సహ యజమానిగా కూడా వ్యవహరిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటున్న ప్రీతిజింటా పలు విషయాలపై స్పందిస్తూ క్లారిటీ ఇస్తోంది. తాజాగా, ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రీతిజింటా ఇండియన్ ఆర్మీకి భారీ విరాళం ప్రకటించింది. కమాండ్‌లోని ఆర్మీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ప్రీతి జింటా రూ. 1.10 కోట్ల విరాళం ఇచ్చింది. జైపూర్‌లో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా సౌత్ వెస్ట్రన్ కమాండ్ ఆర్మీ కమాండర్, ప్రాంతీయ అధ్యక్షుడు శప్తా శక్తి ఆర్మీ కుటుంబాలు హాజరైన సందర్భంగా ఈ విరాళం అందచేయడం జరిగింది. ఇక ఈ విసయంపై ఆమె మాట్లాడుతూ.. “మన సాయుధ దళాల ధైర్యవంతులైన కుటుంబాలకు సహాయం అందించడం గౌరవం బాధ్యత. మన సైనికులు చేసిన త్యాగాలను ఎప్పటికీ నిజంగా తిరిగి చెల్లించలేము. అయితే, మనం వారి కుటుంబాలకు అండగా నిలిచి ముందుకు సాగడంలో వారికి మద్దతు ఇవ్వగలం. భారత సాయుధ దళాల పట్ల నాకు ఎంతో గర్వంగా ఉంది. మన దేశం కోసం పోరాడే ధైర్యవంతులైన రక్షకులకు అచంచలమైన మద్దతుగా నిలుస్తాము” అని చెప్పకొచ్చింది. ఇక ఈ విషయం సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్ అవుతుండటంతో.. అసలు విషయం తెలుసుకున్న నెటిజన్లు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# స్టేజ్‌పై భావోద్వేగానికి లోనైన శింబు

కోలీవుడ్ స్టార్ హీరో శింబు, కమల్ హాసన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘థగ్‌లైఫ్’, మణిరత్నం(దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 5న థియేటర్స్‌లోకి రానుంది. ఈ నేపథ్యంలో.. మూవీ మేకర్స్ ఆడియో లాంచ్ నిర్వహించారు. ఇక ఇందులో పాల్గొన్న శింబు ఎమోషనల్ కామెంట్స్ చేశారు. “ఏఆర్ రెహమాన్‌ను నేను చాలా ఇబ్బంది పెట్టాను ఇప్పటికీ పెడుతూనే ఉన్నా. నేను పాడిన ఓ పాట వివాస్పదమైంది. అది నా జీవితంలో క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొన్నా. అప్పుడు ఆయనే పనులన్నీ మానేసి నాతో వర్క్ చేశారు. ఇటీవల నాకు రెడ్‌కార్డ్ జారీ అయినట్లు వార్తలు వచ్చాయి. దీంతో అది చూసిన నిర్మాతలు నాకు సినిమాల్లో అవకాశాలు ఇవ్వలేదు. చాలా కష్టంగా అనిపించింది. ఈ సమయంలో నన్ను నమ్మి మణిరత్నం నాకు చాన్స్ ఇచ్చారు. ఎప్పటికీ ఆయనే నా గురువు. ఇన్నేళ్ల నా సినీ ప్రయాణంలోఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా. అప్పుడు నా ఫ్యామిలీ అండగా నిలిచింది. నటుడిగా స్ఫూర్తి నింపింది మాత్రం కమల్ హాసన్ గారే. ఆయన సినిమాలు చూసి పెరిగాను. నటుడిగా మలిచివ్యక్తి ఆయనే. నాలాంటి ఎంతోమంది స్ఫూర్తి. కమల్ హాసన్‌ను ఎవరూ రిప్లేస్ చేయలేరు. ఆయన ఒక గొప్ప నటుడు” అని చెప్పకొచ్చారు. ఇక ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే స్టేజ్‌పై మాట్లాడుతూ శింబు కన్నీరు పెట్టుకున్నారు. కాసేపటి తర్వాత బ్లాక్ స్పెడ్స్ పెట్టుకుని కవర్ చేశారు. ఇక అది చూసిన నెటిజన్లు అంతా ఆశ్చర్యపోతున్నారు.





# బలగం నటుడు జీవీ బాబు మృతి

చిన్న సినిమాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన బలగం ఎంతటి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. ప్రియ దర్శి అండ్ కావ్య కల్యాణ్ రామ్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి వేణు దర్శకత్వం వహించారు. వీరితో పాటుగా రూప లక్ష్మి, సుధాకర్ రెడ్డి, మురళీధ్ గౌడ్, రచ్చ రవి, జీవీ బాబు వంటి తదితరులు కీలక పాత్రల్లో నటించారు. తెలంగాణ కల్చర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీ పెద్ద హిట్ అయ్యిది. అయితే ఈ సినిమాలో హీరో ప్రియదర్శిగా చిన్నతాతగా నటించిన అంజన్న (జీవీ బాబు) కొద్ది రోజుల నుంచి అనారోగ్యంలో బాధపడుతున్నారు. కిడ్నీలు దెబ్బతినడమే కాకుండా.. గొంతులో ఇన్ఫెక్షన్‌తో నోటిలో మాట కూడా రాలేదు.

చాలా రోజులుగా ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటోన్న ఆయన ఆసుపత్రిలో బిల్లు కూడా కట్టలేని పరిస్థితి నెలకొంది. అయితే కొంతకాలంగా వరంగల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించినట్లు తాజాగా నటుడు వేణు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ‘‘జి వి బాబు గారు ఇకలేరు. ఆయన జీవితం మొత్తం నాటక రంగంలోనే గడిపారు. చివరి రోజుల్లో ఆయన్ని బలగం ద్వారా పరిచయం చేసే భాగ్యం నాకు దక్కింది. ఆయన ఆత్మ శాంతించాలి అని కోరుకుంటున్నాను’’ అంటూ వేణు సంతాపం వ్యక్తం చేశారు.



# 'బద్మాషులు' సాంగ్‌ను విడుదల చేసిన ప్రియదర్శి

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'బద్మాషులు'. జూన్ 6న విడుదల కానున్న ఈ చిత్రం నుంచి తాజాగా ‘జిందగీ బిలాలే’ సాంగ్‌ను విడుదల చేశారు. శంకర్ చేగూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మూవీని హిలేరియస్ ఎంటర్టైనర్, తార స్టోరీ టెల్లర్స్ బ్యానర్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బి. బాలకృష్ణ, C.రామ శంకర్ నిర్మాతలుగా ఉన్నారు. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి జిందగీ బిలాలే సాంగ్‌ను హీరో ప్రియదర్శి విడుదల చేశారు.

ఈ సందర్భంగా ప్రియదర్శి మాట్లాడుతూ.. 'బద్మాషులు సినిమా ప్రొమోషల్ సాంగ్ జిందగీ బిలాలే సాంగ్ విడుదల చేయడం జరిగింది, సాంగ్ చాలా ఎంటర్టైన్‌గా ఉంది, తేజ కూనూరు సంగీతం అందించారు, చరణ్ అర్జున్ , విహ పాడిన ఈ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వస్తుందని అనుకుంటున్నాను, టీజర్ హిలేరియ్‌గా ఉంది, ఫన్ టేక్ ఓవర్ చేసినట్లు ఉంది, జూన్ 6న విడుదల కాబోతున్న బద్మాషులు మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని ఆయన అన్నారు. ఇది మన ఊరి కథ అనే విధంగా ఈ చిత్రంలో పాత్రలు చాలా సహజంగా ఉంటాయని మేకర్స్ అన్నారు. డైరెక్టర్ శంకర్ చేగూరి వంద శాతం జనాలను రెండు గంటలు నవ్వించాలనే ఉద్దేశ్యంతో బద్మాషులు చిత్రాన్ని తెరకెక్కించారని తెలిపారు.

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ పాత్రలు విశేషంగా, రూరల్ రూటెడ్ కథ, కథనం, కామెడీ చాలా ఆర్గానిక్ గా ఈ చిత్రాల్లో ఉండబోతున్నాయి, డైరెక్టర్ శంకర్ చేగూరి టేకింగ్ చాలా రిఫ్రెషింగ్ గా అన్ని వర్గాల ఆడియన్స్ కు కనెక్ట్ అయ్యే విధంగా ఉండబోతోంది. జూన్ 6న ఈ చిత్రాన్ని దీపా ఆర్ట్స్ థియేటర్స్ లో విడుదల చెయ్యబోతోంది.



# ‘స్పిరిట్’ సినిమాలో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా అనౌన్స్‌మెంట్

### ఆర్జీవీ ప్రశంసలు వైరల్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయారు. పూర్తిగా సోషల్ మీడియాకు కూడా దూరం అయిన ఆయన కల్కి-2, సలార్-2, ఫౌజీ వంటి చిత్రాలు చేస్తున్నారు. అలాగే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఆయన ‘స్పిరిట్’ సినిమా చేయనున్నారు. అయితే మొదటిసారి ఇందులో డార్లింగ్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ మూవీ నుంచి అప్డేట్స్ వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. అయితే ఇందులో ప్రియాంక చోప్రా, రుక్మిణి వసంత్ హీరోయిన్లుగా నటిస్తున్నట్లు గత కొద్ది కాలంగా వార్తలు వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. కానీ ప్రియాంక అత్యధిక రెమ్యునరేషన్ డిమాండ్ చేయడంతో ఆమెను తొలగించారని ప్రచారం జరుగుతోంది.

ఈ నేపథ్యంలోనే.. మూవీ మేకర్స్ ఈ సినిమాలో హీరోయిన్‌ను ప్రకటించడంతో సెన్సేషన్‌గా మారింది. ఇందులో ప్రభాస్ సరసన బాలీవుడ్ హాట్ బ్యూటీ త్రిప్తి డిమ్రినటిస్తున్నట్లు తెలుపుతూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. అంతేకాకుండా ఈ సినిమా ఏకంగా 9 భాషల్లో తెరకెక్కనున్నట్లు వెల్లడించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. దీంతో ఈ పోస్టులు చూసిన వారంతా అసలు ఆమె సెట్ అవుతుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో.. తాజాగా, ఈ విషయంపై రామ్ గోపాల్ వర్మ ట్విట్టర్ ద్వారా స్పందించాడు. “సందీప్ రెడ్డి వంగాత్రిప్తి ట్రిమండస్ ప్రదర్శనను స్క్రీన్‌పై చూడబోతున్నారు. ఇంతకు ముందే ‘యానిమల్’లో చూశారు. ఇక ఇప్పుడు ‘స్పిరిట్’ఆమెను హీరోయిన్‌గా పెట్టడం మంచి నిర్ణయం. ఆమె ఈ సినిమాలో నటించడం తనకు బిగ్ థింగ్ అవుతుంది. బాలీవుడ్‌లో సెన్సేషన్‌గా మారుతుంది. కంగ్రాట్స్ త్రిప్తి ఇదే నీకు సరైన సమయం ‘స్పిరిట్’ ద్వారా ఆకాశంలోకి ఎగురుతావు. ఇండస్ట్రీలో స్టార్‌గా మారుతావు” అని రాసుకొచ్చారు. ఇక అది చూసిన త్రిప్తి ధన్యవాదాలు చెప్పతూ ఆర్జీవీ కామెంట్లు తనకు ఎంతో విలువైనవని రిప్లై ఇచ్చింది. ప్రస్తుతం వీరిద్దరి పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సన్‌రైజర్స్ సూపర్ విక్టరీ



**(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)**

ఐపీఎల్ 2025 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ విజయంతో ముగించింది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తర్వాత జోరందుకున్న హైదరాబాద్.. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో అంతకుమించిన దూకుడు ప్రదర్శించి వరుసగా మూడో విజయంతో ఈ సీజన్‌కు టాటా చెప్పింది. ఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్‌పై హైదరాబాద్ 110 పరుగుల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. హెన్రిచ్ క్లాసెన్ (105*; 39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్స్‌లు) మెరుపు శతకం బాదడంతో తొలుత సన్‌రైజర్స్ 3 వికెట్ల నష్టానికి 278 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ కొండంత లక్ష్యఛేదనలో కేకేఆర్ 18.4 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. మనీశ్ పాండే (37; 23 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్. హర్షిత్ రాణా (34*; 21 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) చివర్లో మెరుపులు మెరిపించాడు. ఓపెనర్ సునీల్ నరైన్ (31; 16 బంతులలో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా దాన్ని భారీ ఇన్నింగ్స్‌గా మలచలేకపోయాడు. అజింక్య రహానె (15), అంగ్‌క్రిష్ రఘువంశీ (14), రమణ్‌దీప్ సింగ్ (13), క్వింటన్ డాకాక్ (9), రింకు సింగ్ (9) పరుగులు చేశారు. రస్సెల్ ఎదుర్కొన్న తొలి బంతికే గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. హైదరాబాద్ బౌలర్లలో జయ్‌దేవ్ ఉనద్కత్ (3/24), ఎషాన్ మలింగ (3/31), హర్ష్ దూబె (3/34) అదరగొట్టారు. ఈ విజయంతో హైదరాబాద్ ప్రస్తుతానికి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది.

మొదటి నుంచీ దూకుడే..



సన్‌రైజర్స్ బ్యాటర్లలో క్లాసెన్ శతకానికితోడు ట్రావిస్ హెడ్ (76; 40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అభిషేక్ శర్మ (32; 16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపూ మెరుపులు మెరిపించాడు. ఇషాన్ కిషన్ (29; 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వైభవ్ అరోరా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండే పరుగులు రాగా.. తర్వాత నుంచి హైదరాబాద్ బ్యాటర్ల విధ్వంసం మొదలైంది. వైభవ్ వేసిన మూడో ఓవర్‌లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ బాదిన హెడ్.. హర్షిత్ బౌలింగ్‌లో మూడు ఫోర్లు బాదాడు. నరైన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు బాదిన అభిషేక్ తర్వాత బంతికే ఔటైపోయాడు. కాసేపటికే హెడ్ అర్ధ శతకం (26 బంతుల్లో) అందుకున్నాడు. మరోవైపు, క్రీజులోకి వచ్చిన క్లాసెన్ కూడా దూకుడుగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది.

వరుణ్ బౌలింగ్‌లో క్లాసెన్ మూడు ఫోర్లు బాదేయడంతో 10 ఓవర్లకు స్కోరు 139/1కి చేరింది. హర్షిత్ బౌలింగ్‌లో క్లాసెన్ వరుసగా 4, 6, 6 కొట్టి 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్నాడు. తర్వాత నరైన్ బౌలింగ్‌లో హెడ్.. రస్సెల్‌కు చిక్కాడు. క్లాసెన్, ఇషాన్ జోరు కొనసాగించడంతో 18 ఓవర్లకు స్కోరు 250 దాటింది. దీంతో సన్‌రైజర్స్ తన పేరిట ఉన్న 287/3 స్కోరు రికార్డును తిరగరాస్తుందేమో అనిపించింది. అయితే, తర్వాతి ఓవర్లో వైభవ్ ఇషాన్‌ను ఔట్ చేసి ఏడు పరుగులే ఇచ్చాడు. చివరి ఓవర్‌లో 17 పరుగులే రావడంతో కొత్త రికార్డు నమోదు కాలేదు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 2, వైభవ్ అరోరా ఒక వికెట్ పడగొట్టారు.

ఐదు వరుస ఓటముల తర్వాత కోల్‌కతాపై హైదరాబాద్‌కు ఇది మొదటి విజయం.

ఐపీఎల్‌లో కోల్‌కతాకు ఇది అతిపెద్ద ఓటమి. అంతకుముందు 2018లో ముంబయిపై 102 పరుగుల తేడాతో ఓడింది. హైదరాబాద్‌కు ఇది రెండో అతిపెద్ద విజయం. 2019లో ఆర్సీబీపై సన్‌రైజర్స్ 118 రన్స్ తేడాతో గెలిచింది.

# రామలల్లా దర్శనానికి విరాట్, అనుష్క రాక

## అయోధ్యలో అభిమానుల హర్షధ్వానాలు



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన సతీమణి అనుష్క శర్మతో కలిసి అయోధ్య రామమందిరం సందర్శించాడు. ప్రస్తుతం లఖ్‌నవూతో మ్యాచ్ నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉన్న విరాట్ ఆదివారం అయోధ్య చేరుకున్నాడు. భారీ భద్రతనడుమ తొలుత విరాట్ అయోధ్య రామమందిరంలోని హనుమాన్ గఢీని సందర్శించి, భార్య అనుష్కతో ప్రత్యేక పూజలు చేశాడు. ఈ నేపథ్యంలో విరాట్ అనుష్కకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విరాట్ దంపతులు హనుమాన్ గఢీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి హేమంత్ దాస్ విరాట్ అనుష్కకు ఆశీర్వచనం అందించారు. ఈ క్రమంలోనే విరాట్ దంపతులను ఆలయ పూజారులు సన్మానించి, హనుమాన్ ప్రతిమ, ఫొటో ఫ్రేమ్ అందించారు. ఆ తర్వాత రామమందిరం సందర్శించి రామ్‌లల్లాను దర్శించుకున్నారు. అయితే రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ తర్వాత విరాట్ అయోధ్యకు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఇక విరాట్ రాకతో అయోధ్య ఆలయ ప్రాంగణం మరింత రద్దీగా మారింది. తమ అభిమాన క్రికెటర్‌ను చూసేందుకు ఫ్యాన్స్ పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

2024 జనవరి 22న రామ మందిరంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విరాట్ కోహ్లీకి రామమందిర ట్రస్టు అధికారులు ఆహ్వానం అందించారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాల్సిందిగా కోరారు. అయితే పలు కారణాల వల్ల విరాట్ అప్పుడు రాలేకపోయాడు. తాజాగా భవ్య రామమందిరాన్ని సమీమణితో కలిసి దర్శించుకున్నాడు.

కాగా, విరుష్క జంటకు ఆధ్యాత్మిక చింతన కాస్త ఎక్కువే. తమతమ బిజీ షెడ్యూల్‌లో ఖాళీ సమయం దొరికితే ఆధ్యాత్మిక యాత్రలకు వెళ్తుంటారు. ఇటీవలే ఉత్తర్‌ప్రదేశ్‌లోనీ వృందావన్ ధామ్‌ను సందర్శించి, ప్రేమానంద్ మహారాజ్‌ను దర్శించుకున్నారు.

ఇక ఈ సీజన్‌లో మే 27న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు లఖ్‌నవూ ఎకాన స్టేడియం వేదిక కానుంది.



# ఛార్‌ధామ్ యాత్రకు వెళ్తున్నారా..



కేదార్‌నాథ్ ధామ్‌కు తీర్థయాత్రకు వెళ్ళే పర్యాటకులకు అక్కడ అధికారులు కొన్ని సూచనలు చేశారు. పర్యాటకులకు ఈ తీర్థ యాత్ర చేసే సమయంలో కొన్ని వస్తువులను తీసుకెళ్లడం నిషేధించబడిరది. వీటిలో మాంసాహారం, ప్లాస్టిక్, మద్యం, డ్రోన్లు ఉన్నాయి. మీ ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలంటే కొన్ని వస్తువులను తీసుకుని వెళ్ళవద్దు. అనవసరమైన సామాన్లు తీసుకుని వెళ్ళితే ఈ చార్ ధామ్ యాత్రలో సమస్యలు కలుగవచ్చు. ఛార్ ధామ్ యాత్ర నేపథ్యంలో భారీ సంఖ్యలో భక్తులు చేరుకుంటున్నారు. మరోవైపు కేదార్‌నాథ్ ధామ్ యాత్రకు కొంతమంది ఇంకా బయలుదేరడానికి సిద్ధమవుతున్నారు. కేదార్‌నాథ్‌కు వెళ్లేటప్పుడు కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. ఈ యాత్ర చేసే సమయంలో పొరపాటున కొన్ని వస్తువులను తీసుకుని వెళ్తే.. ఎటువంటి పుణ్యం లభించదు. సరికదా మీరు కేదార్ నాథుడిని దర్శనం చేసుకొకుండానే తిరిగి రావాల్సి ఉంటుంది. దీంతో మీ ఛార్ ధామ్ యాత్ర అసంపూర్ణంగా మిగిలిపోతుంది. మాంసం, చేపలు, గుడ్లు కేదార్‌నాథ్ యాత్ర ఒక ఆధ్యాత్మిక తీర్థయాత్ర. కనుక మతపరమైన దృక్కోణంలో మాంసం, చేపలు, గుడ్ల వంటివి ఈ యాత్రను చేసే సమయంలో తీసుకెళ్లడం సముచితం కాదు. హిందూ మతంలో మతపరమైన ప్రదేశాలలో ఈ వస్తువులు నిషేధించబడ్డాయి. ప్లాస్టిక్, పాలిథిన్ నిషేధం కేదార్‌నాథ్ ఆలయం ప్రకృతి సౌందర్యానికి నిలయం. సమీపంలో మందాకిని నది, వాసుకి సరస్సు, చోర్బారి సరస్సు, గౌరీకుండ్ ఉన్నాయి. చుట్టుపక్కల హిమాలయ అందాలు ఉత్కంఠభరితమైన దృశ్యాన్ని అందిస్తాయి. ఈ అందాన్ని కాపాడుకోవడానికి ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్లాస్టిక్, పాలిథిన్‌ను నిషేధించింది. కనుక ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువులను తీసుకెళ్లవద్దు. మద్యం లేదా ఇతర మాదకద్రవ్యాల వాడకం కేదార్‌నాథ్ ధామ్ ఆలయ ప్రాంగణంలో ఎవరైనా మద్యం లేదా మాదకద్రవ్యాలతో పట్టుబడితే.. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తరాఖండ్ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కనుక ఈ వస్తువులను మీతో తీసుకెళ్లడం మానుకోండి.

అనుమతి లేకుండా డ్రోన్లు కేదార్‌నాథ్ ఆలయ సహజ సౌందర్యాన్ని చిత్రీకరించేందుకు చాలా మంది డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నారు. అయితే ప్రభుత్వం డ్రోన్ల వాడకాన్ని కూడా నిషేధించింది. మీరు డ్రోన్ తీసుకెళ్తుంటే, ప్రయాణాన్ని ప్రారంభించే ముందు అధికారుల నుంచి అనుమతి పొందవలసి ఉంటుంది.కేదార్‌నాథ్ యాత్ర కఠినమైన ప్రయాణం. కేదార్‌నాథ్ యాత్ర కష్టతరమైన ప్రయాణం. ప్రయాణం సజావుగా సాగడానికి, అసౌకర్యాన్ని నివారించడానికి, అనవసరమైన వస్తువులకు దూరంగా ఉండాలి. పర్వతారోహణ చేసే సమయంలో అనేక కిలోమీటర్లు నడవాలి. కనుక అనవసరమైన వస్తువులను తీసుకెళ్లవద్దు. ఘాటు వాసన కలిగిన పరిమళ ద్రవ్యాలు కేదార్‌నాథ్ బాబా ఆలయం సముద్ర మట్టానికి చాలా ఎత్తులో ఉంది. ఆక్సిజన్ కొరత ఎక్కువగా ఉన్న చోట. వారు ఇక్కడికి చేరుకున్న వెంటనే ప్రజలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం ప్రారంభిస్తారు. కనుక అత్యంత ఘాటు వాసన గల పరిమళ ద్రవ్యాలను మీతో తీసుకెళ్లకండి. శబ్దం చేసే స్పీకర్‌లు కేదార్‌నాథ్ యాత్ర అనేది ఒక ఆధ్యాత్మిక తీర్థయాత్ర. ఇక్కడ శివయ్య భక్తులు తమ ప్రియమైన దేవుడిని పూజించడానికి భక్తిశ్రద్దలతో వెళతారు. అటువంటి సమయాల్లో శాంతిని కాపాడటానికి లౌడ్ స్పీకర్లను ఉపయోగించకుండా ఉండండి. ఇది ఇతరుల పూజకు, ప్రార్ధనకు ఆటంకం కలిగించవచ్చు.



# సీఎస్‌కే ఆల్‌రౌండ్ షో..



ఐపీఎల్ 2025 సీజన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ అద్భుతమైన విజయంతో ముగించింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 83 పరుగుల తేడాతో సీఎస్‌కే చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో చెన్నై జట్టు ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 230 పరుగుల భారీ స్కోర్ సాధించింది. సీఎస్‌కే ఇన్నింగ్స్‌లో డెవాల్డ్ బ్రెవిస్(23 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 57), డెవాన్ కాన్వే(35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52) సూపర్ హాఫ్ సెంచరీలతో చెలరేగగా.. ఆయూష్ మాత్రే(17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34), ఉర్విల్ పటేల్(19 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు పడగొట్టగా.. సాయికిషోర్, రషీద్ ఖాన్, షారుఖ్ ఖాన్ తలా వికెట్ సాధించారు.

సుదర్శన్ ఒక్కడే..

అనంతరం లక్ష్య చేధనలో సీఎస్‌కే బౌలర్లు చెలరేగడంతో గుజరాత్.. 18.3 ఓవర్లలో 147 పరుగులకే కుప్పకూలింది. గుజరాత్ బ్యాటర్లలో ఓపెనర్ సాయిసుదర్శన్(41) టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు.

కెప్టెన్ శుబ్‌మన్ గిల్ 13 పరుగులు చేయగా.. స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ కేవలం 5 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచారు. సీఎస్‌కే బౌలర్లలో అన్షుల్ కాంబోజ్, నూర్ అహ్మద్ తలా మూడు వికెట్లు పడగొట్టి గుజరాత్‌ను దెబ్బ తీయగా.. రవీంద్ర జడేజా రెండు, పతిరానా, ఖాలీల్ అహ్మద్ చెరో వికెట్ పడగొట్టారు.

కాగా ఈ ఓటమితో గుజరాత్ టైటాన్స్ టాప్ 2 స్థానం ప్రమాదంలో పడింది. ఆర్సీబీ, పంజాబ్ తమ తదుపరి రెండు మ్యాచ్‌లలో గెలిస్తే గుజరాత్ మూడో స్థానానికి పడిపోతుంది.